జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php

ప్రజాపాలన

నిజాయితీ, నిబద్ధతతో జర్నలిస్టుగా పనిచేయాలనుకొంటున్నారా?

మీ ఏరియాలోని ప్రజల సమస్యలను మీ కలం ద్వారా ప్రభుత్వదృష్టికి తీసుకువెళ్లాలి అనుకుంటున్నారా ?ఇంకెందుకు ఆలస్యం మీ ఏరియాకు మీరే రిపోర్టర్... రండి ..ప్రజాపాలన దినపత్రిక మీకు అవకాశం కల్పిస్తుంది

వివరాలకు సంప్రదించండి 8886022523

| సంపుటి 6 సంచిక 77 | హైదరాబాద్, జనవరి 11 బుధవారం 2023 | 8 పేజీలు | వెల : 5.00 |
|---|---|---|---|

# మొన్న చూసింది ట్రైలరే..

## 2023లో అసలు సినిమా చూపిస్తాం : కేటీఆర్



హైదరాబాద్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిపై రాష్ట్ర ఐటీ పరిశ్రమల మంత్రి కల్వకుంట్ల తారకరామారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో జరిగిన సెస్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధించిన సందర్భంగా వినియోగదారులు, రైతులతో ఏర్పాటు చేసిన కృతజ్ఞత సభలో మంత్రి కేటీఆర్ మాట్లాడారు. సెస్ ఎన్నికల సమయంలో బండి సంజయ్ రూ. 5కోట్లు తీసుకువచ్చాడని.. అభ్యర్థులు ఆగమై తనకు ఫోన్లు చేశారని చెప్పారు. డబ్బులు పంచినోళ్లే మళ్లీ బీఆర్ఎస్‌పై ఆరోపణలు చేస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. గుజరాత్ పైసలు ఎన్ని వచ్చినా.. కేసీఆర్‌నే ముఖ్యమంత్రిని చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా దిశానిర్దేశం చేసిందన్నారు. సెస్‌లో గెలువలేనోడు రాష్ట్రంలో గెలుస్తారా?.. మొన్న చూసింది ట్రైలరే.. 2023లో అసలు సినిమా చూపిస్తాం అన్నారు. తెలంగాణలో బీజేపీని నడిపేవాళ్లు మూరు?లని.. మెదడు ఎక్కడుంది? మోకాళ్లలో ఉందా?.. దమ్ముంటే తమకంటే ఎక్కువగా మంచి పనులు చేసి ప్రజల మనసులను గెలవాలని హితవు పలికారు. రాజన్న సిరిసిల్ల జిల్ల అభివృద్ధిలో దేశం మొత్తంలోనే ఆదర్శంగా నిలిచిందన్నారు. పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా విద్యుత్‌ను సరఫరా చేయాలని, సిరిసిల్ల జిల్లా సెస్ పరిధిలో ప్రత్యేక విద్యుత్ ప్రణాళిక రూపొందించాలన్నారు. ఎన్ని నిధులైనా ఇప్పిస్తానన్నారు.

**మోదీ ఎవరికి దేవుడు..?**

ప్రధాని నరేంద్ర మోదీ ఎవరికి దేవుడు..? నీకా? గుజరాత్ కా? అంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ని నిలదీశారు. పెట్రోల్, గ్యాస్ ధరలు పెంచినోడని, నల్లచట్టాలు తెచ్చి రైతులను చంపినోడు దేవుడట.. చేనేత మీద పన్నువేసినోడు దేవుడా? అంటూ నిలదీశారు. డీజిల్, పెట్రోల్ ధరలు పెంచుతూ.. ఆర్టీసీ ధరలు పెంచొద్దంటారని.. మరి బస్సులు ఎలా నడుపమంటారని ధ్వజమెత్తారు. కేంద్ర ధరలు పెంచడంలో ఆర్టీసీ చార్జీలు పెరిగాయని స్పష్టం చేశారు.

(మిగతా 2లో..)

# పార్స్ సభ్యత్వం తీసుకున్న అఖిల్ గ్రూప్స్ అధినేత...





విజయవాడ (ప్రజాపాలన ప్రతినిధి ):బహుజన రాజ్యాధికారం లక్ష్యంగా ముందుకు దూసుకెళ్తున్న పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి (పార్స్) సభ్యత్వాన్ని విజయవాడ అఖిల్ గ్రూప్స్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ .కందుల.అఖిల్ యాదవ్ తీసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమం లో పార్స్ నేషనల్ కన్వీనర్ డాక్టర్. కటికల.శివబాగ్యరావు మాట్లాడుతూ బహుజన రాజ్యాధికారమే ఏకైక లక్ష్యంగా పార్స్ త్వరలో రాజకీయపార్టీ గా ఆవిరభవించబోతున్నట్లు తెలిపారు. పది లక్షల సంతకాలు సేకరించి ఏప్రిల్ లో పార్టీ ప్రకటన చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం లో పార్స్ ఎపి స్టేట్ కోఆర్డినేటర్ నమ్మిన .అప్పారావు, కోశాధికారి గురజాల.శ్రీనివాసరావు,బంటు. మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**సంతకాల సేకరణ కార్యక్రమం లో పాల్గొన్న ప్రొఫెసర్ కాశీమ్...**

హైదరాబాద్ లో నిర్వహించిన సంతకాల సేకరణ కార్యక్రమం లో ప్రొఫెసర్ కాశీమ్ పాల్గొన్నారు. బహుజన రాజ్యం కాక్షించే ప్రతీ ఒక్కరు పార్స్ సభ్యత్వం తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో బహుజనులు పెద్ద ఎత్తున పాల్గొని సంతకాలు చేశారు.

## కంటి వెలుగు ప్రారంభంలో పాల్గొననున్న ఇతర రాష్ట్రాల సీఎంలు: మంత్రి హరీశ్‌రావు




సిద్దిపేట : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రెండవ దశ కంటి వెలుగు ప్రారంభం ఖమ్మం జిల్లా నుంచి మొదలవుతుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి సీఎం కేసీఆర్‌తో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన ముఖ్యమంత్రులు సైతం హాజరుకానున్నారని ఆయన తెలిపారు. మంగళవారం సిద్ధిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన కంటి వెలుగు అవగాహన సదస్సు లో మంత్రి మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో కంటి సమస్యతో ఎవరు బాధపడవద్దని రెండవ దశ కార్యక్రమం ప్రారంభిస్తున్నామని తెలిపారు. జనవరి 18 నుంచి జూన్ 30వరకు జరిగే రెండవ దశ కంటి వెలుగు లాంఛనంగా ప్రారంభిస్తామన్నారు. తొమ్మిది నుంచి సాయంత్రం 4గంటల వరకు సోమవారం నుంచి శుక్రవారం కంటి పరీక్ష చేస్తారని మంత్రి చెప్పారు. జిల్లాకు అదనంగా 35మంది వైద్యులను రిక్రూట్ చేశామని పేర్కొన్నారు. ఉదయం ఇప్పటికే 10లక్షల కళ్ల అద్దాలు ప్రతి జిల్లాకు చేరుకున్నాయని వివరించారు. రెండో దశ కంటి వెలుగుకు రూ. 250కోట్లు ప్రభుత్వం ఖర్చు చేస్తుందన్నారు. జిల్లాలో 45 వైద్య బృందాలు, మరో మూడు అదనపు బృందాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రపంచం లోనే సామూహిక కంటి వెలుగు కార్యక్రమం తెలంగాణలో తప్పా దేశంలో ఎక్కడా లేదన్నారు. ఈ సమావేశంలో ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీలు ఫారుఖ్‌హుస్సేన్, యాదవ రెడ్డి, జడ్పీ చైర్మన్ రోజా శర్మ, ఎమ్మెల్యే లు ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, ఒడితెల సతీశ్, ఎఫ్ డీ సీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, డీఎంహెచ్‌వో కాశీనాథ్ ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## సిఎస్ సోమేష్ కుమార్ పై సిబిఐ విచారణకు రేవంత్ డిమాండ్



హైదరాబాద్ : తెలంగాణ సీఎస్ సోమేశ్ కుమార్ ను ఎపి క్యాడర్ కు పంపి వేయాలని హైకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో టిపిసిసి చీఫ్ రేవంత్ రెడ్డి స్పందిస్తూ సోమేష్ తీసుకున్నపలు నిర్ణయాలపై సిబిఐ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.. ఈ మేరకు ఆయన ట్విట్టర్ లో ట్విట్ చేశారు.. సిఎస్ నియామకం అక్రమం అని తామే మొదటి నుండి చెబుతున్నామని, తాజాగా హైకోర్టు ఇచ్చిన తీర్పుతో తామ చెప్పిందే నిజమైందని అన్నారు. బిహార్ ముఠాకు సోమేశ్ లీడర్ అని అంటూ అనర్హుడైన ఆయనను వెంటనే పదవి నుంచి తొలగించాలని అన్నారు. అలాగే. ఇప్పటి వరకు సోమేశ్ కుమార్ సీఎస్ హోదాలో తీసుకున్న నిర్ణయాలు సమీక్షించి వాటిపై సీబీఐ విచారణ చేపట్టాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమేశ్ కుమార్ తీసుకొచ్చిన ధరణి పోర్టల్ రద్దు చేయాలని కోరారు. కోర్టు తీర్పుతో నైనాతెలంగాణ ప్రాంత ఐఏఎస్ లకు ఎప్పటికైనా ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వానికి రేవంత్ సూచించారు.



## ఈనెల 28న తెలంగాణకు అమిత్ షా

హైదరాబాద్: సంక్రాంతి తర్వాత తెలంగాణ రాజకీయాలు మరింత హీటెక్కనున్నాయి. సంక్రాంతి తర్వాత వేగం పెంచేందుకు పార్టీలన్నీ సిద్ధమవుతున్నాయి. ఈనెల 28న రాష్ట్రానికి కేంద్ర హోం మంత్రి అమిత్ షా రానున్నారు. పార్టీ సంస్థాగత అంశాలే ప్రధాన అజెండాగా అమిత్ షా పర్యటన ఉండనుంది. వివిధ స్థాయిలో పార్టీ నేతలతో ఆయన సమావేశం కానున్నారు. పార్టీ శ్రేణులను ఎన్నికలకు సమాయత్తం చేస్తూ దిశానిర్దేశం చేయనున్నారు. అలాగే సంఘ్ నేతలతో కూడా అమిత్ షా సమావేశం అయ్యే అవకాశం ఉంది. మరోవైపు అంతకంటే ముందుగానే రాష్ట్రంలో కేసీఆర్, మోడీ బహిరంగ సభలు జరగనున్నాయి. రెండు రోజుల తేడాతో రెండు బహిరంగ సభలు జరగనుండటంతో రాష్ట్రంలో ఎన్నికల వేడి రాజుకుంది. మోడీ, అమిత్‌ను టార్గెట్ చేస్తూ కేసీఆర్ విమర్శలు చేస్తుంటే.. బీజేపీ నేతలంతా కేసీఆర్, కేటీఆర్?ను టార్గెట్ చేస్తూ అదే స్థాయిలో విమర్శలకు కౌంటర్ ఇస్తున్నారు. ఇక అమిత్ షా పర్యటనకు ముందే కేసీఆర్ సభ ఉండటంతో తర్వాత పరిణామాలు ఎలా ఉండనున్నయో చూడాల్సి ఉంది.

## గోల్డెన్ టెంపుల్‌లో రాహుల్ గాంధీ పూజలు



అమృత్‌సర్: రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర పంజాబ్‌లోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా ఆయన అమృత్‌సర్ లోని గోల్డన్ టెంపుల్ ను దర్శించుకున్నారు. కాషాయ రంగు తలపాగా ధరించిన రాహుల్ అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాహుల్ మూడెంచల భద్రత ఉన్నప్పటికీ భద్రతా సిబ్బంది ఎవరూ కూడా టెంపుల్ లోపలికి రాలేదు. రాహుల్ కూడా టెంపుల్ లోపల కూడా సామాన్య వ్యక్తిలానే ఉన్నారు. ఆపరేషన్ బ్లూ స్టార్ తర్వాత గాంధీ కుటుంబానికి చెందిన ఒక వ్యక్తి గోల్డన్ టెంపుల్లోకి రావడం ఇదే తొలిసారి. పంజాబ్ లో రాహుల్ 10 రోజులపాటు 350 కిలోమీటర్లు నడవనున్నారు. సెప్టెంబర్ 7న తమిళనాడులోని కన్యాకుమారి నుంచి ప్రారంభమైన భారత్ జోడో యాత్ర జనవరి 30న శ్రీనగర్‌లో ముగియనుంది. ఇప్పటివరకు తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్‌లను కవర్ లను కవర్ చేసి పంజాబ్ లో చేరింది.

## తెలంగాణ చీఫ్ సెక్రటరీ సోమేశ్ కుమార్ కు మరో షాక్



హైదరాబాద్: తెలంగాణ చీఫ్ సెక్రటరీ సోమేశ్ కుమార్ కు మరో షాక్ తగిలింది. తెలంగాణ నుంచి రిలీవ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ కి కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వ సెక్రెటరీ ఉత్తర్వులు జారీ చేశారు. తక్షణమే సోమేశ్ కుమార్ తెలంగాణ సర్వీస్ ల నుంచి వైదొలిగి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో జాయిన్ అవ్వాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

రేసులో ముగ్గురు అధికారులు..

తెలంగాణ సీఎస్ రేసులో ముగ్గురు అధికారులున్నారు. సీనియారిటీ లిస్ట్ ప్రకారంగా అరవింద్ కుమార్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, రామకృష్ణారావు ప్రస్తుత ఆర్థిక శాఖ కార్యదర్శి, రజత్ కుమార్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఇరిగేషన్ లు ఉన్నారు.

పూలే - అంబేడ్కర్ రాజ్యాధికార సమితి (PARS)

అంబేడ్కర్ రాజనీతి మూవ్ మెంట్ (ARM)

(A Unit of JAC Regn. No. 1047 of 2016)

Central Office: # 6-2-29/3/12, 3rd Floor, Doublat Plaza, Lakdi-ka-pool, Hyderabad-500004

https://ambedkarrajaneethi.com Email : ambedkarrajaneethimovement@gmail.com

ఆత్మ గౌరవ పరిరక్షణే మన లక్ష్యం - రండి కదలిరండి

బహుజన మిత్రులారా!

జై భీమ్

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 74 సంవత్సరాలు అయినప్పటికీ 85 % బహుజనుల సమస్యలు సమస్యలుగానే ఉంటున్నాయి. అత్యధిక జనాభా కలిగి ఉన్న బహుజనులు కూడా, బహుజన సభ్యులను మెమోరాండం ద్వారానే ప్రభుత్వాలను అడుక్కుంటున్నారు. సమస్యలు అర్థం కాని అల్పసంఖ్యాక ఆధిపత్యకులాలు ఈ దేశాన్ని ఏలుతున్నారు. మన దేశాభివృద్ధి జరగాలంటే సమస్యలకు పరిష్కారం తెలిసిన బహుజనులు,పూలే పోరాట పటిమతో బాబా సాహెబ్ డా.అంబేడ్కర్గారు రాజ్యాంగం ద్వారా కల్పించిన హక్కులతో ఒకరి సమస్యను ఒకరు సమర్థించుకుంటూ చేయి చేయి కలిపి ముందుకు సాధిద్దాం. బహుజన కులాల మధ్య అంతరాలను తొలిగించి సభ్యత్వాలను పెంపొందిస్తూ బహుజనుల ఆత్మ గౌరవాన్ని కాపాడుకొందాం.

సమ సమాజ స్థాపనకు ఈ సామాజిక ఉద్యమంలో లక్షలాది మంది మెంబర్స్‌గా చేరడం వల్ల మన సమస్యలను మనమే పరిష్కరించుకోవడమే కాకుండా బహుజన రాజ్యాధికారం వైపు నడిపించగలము.

ప్రధాన ఆశయాలు

సమసమాజ స్థాపనకు పూలే అంబేడ్కర్ రాజ్యాధికార సమితి (PARS) ఆశయాల పట్ల అవగహన కల్పించడానికి రండి.. కదలి రండి..

1. బహుజన సమస్యలను సంవత్సరాల తరబడి పరిష్కారం కాకుండా పేదవాడిని ఇంకా పేదవాడుగా... గుడిసెలను ఇంకా పూడి గుడిసెలుగా... మురికి వాడలను ఇంకా మురికి కుపాలుగా చేస్తూ.. అల్ప సంఖ్యాక ఆధిపత్యకులాలు పరిపాలిస్తున్నారు. అందువల్ల దేశాభివృద్ధి కావాలంటే సమస్యలను పరిష్కరించే సత్తా ఉన్న అత్యధిక జనాభా కలిగిన బీసీలను ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలనేది ప్రతిపాదన.

2.మహిళలను అబలలుగా ఈ సమాజం చిత్రీకరిస్తుంది. కాబట్టి అబల కాదు సబల అని నిరూపించడానికి అన్ని రంగాల్లో మహిళలకు 50% రిజర్వేషన్లు కల్పించాలని ప్రతిపాదిస్తుంది.

3.ఏ కులం సమస్యలు ఆ కులం వారికే తెలుస్తాయి. కానీ 40 లక్షల జనాభా ఉన్న కులాలు ఇంకా అసెంబ్లీ మెట్లు ఎక్కలేదు. కాబట్టి 5 లక్షల జనాభా ఉన్న ప్రతి కులం నుండి నాయకులను అసెంబ్లీకి ఎమ్మెల్యేలుగా పంపాలని ప్రతిపాదన.

4. రిజర్వేషన్ల వల్ల రాష్ట్రం నాశనం అవుతుందని కొంతమంది అల్ప సంఖ్యాకులయిన పాలక కులాల వారు బాధపడుతున్నారు. అందువల్ల భారత రత్న బాబా సాహెబ్ డా.బి.ఆర్.అంబేడ్కర్ గారు భారత రాజ్యంగ పీఠికలో ప్రతిపాదించిన సమానత్వ సిద్ధాంతం ప్రకారం రిజర్వేషన్లను జనాభా ప్రాతిపదికన అన్ని రంగాల్లో అవకాశాలు కల్పిస్తూ మీరెంతో మీకంత ( మీ జనాభా ఎంతో మీకంత రిజర్వేషన్ ) అని ప్రతిపాదిస్తుంది.

5.డా. బీ.ఆర్.అంబేడ్కర్ గారు ప్రతిపాదించిన విధంగా ముస్లీం,క్రిస్టియన్,ఎస్సీ,ఎస్టీ,బుద్దిస్టులకు సేవరేట్ ఎలక్టోరేట్ (ప్రత్యేక నియోజక వర్గాలు) అవసరమని ప్రతిపాదిస్తుంది.

6.సమతా కులం: కులాంతర వివాహం చేసుకున్న వారి యొక్క పిల్లలకు సమతాకులంగా నామకరణం చేస్తే ప్రభుత్వం అంగీకరించాలి. ఆ నవ తరానికి ఆర్థిక, రాజకీయ, ఉద్యోగ, విద్యా రంగాలలో ప్రాముఖ్యత ఇవ్వాలి మరియు వారి తల్లిదండ్రులకు ప్రాముఖ్యతతో కూడిన రక్షణ కల్పించాలి. తద్వారా 150 సంవత్సాలతో అంబేడ్కర్ కోరుకున్న కుల రహిత సమాజాన్ని చూడవచ్చు.

ఈ ప్రతిపాదనలలో ఏ ఒక్క ప్రతిపాదనను అంగీకరించినా...వారు ప్రతి ఒక్కరూ వారి వారి కుటుంబ సభ్యులతో సహా www.ambedkarrajaneethi.com వెబ్సైట్ ద్వారా సభ్యులుగా చేరి ఆశయ సాధనకు మద్దతు తెలిపి, బహుజన ఆత్మగౌరవాన్ని పరిరక్షించుకునేందుకు రండి.. కదలిరండి...

కమిటీల నిర్మాణం

రెండు తెలుగు రాష్ట్రాలలో రాష్ట్ర,జోనల్,పార్లమెంట్,అసెంబ్లీ, మండల స్థాయిలలో కమిటీల నిర్మాణం జరుగుతుంది.

ప్రతి కమిటీలో కనీసం 21 మంది లేదా అంతకంటే ఎక్కువమంది సభ్యులుగా ఉంటారు.

అదేవిధంగా ప్రతి కమిటీలో కనీసం 7 కులాల నుండి లేదా అంతకంటే ఎక్కువ కులాల నుండి ప్రాతినిధ్యం కలిగివుంటుంది.

## పెద్ద తుండ్ల గ్రామస్తులు రంగారెడ్డి జిల్లా గ్రంధాలయ చైర్మన్‌ను ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ సన్మానించారు



ఇబ్రహీంపట్నం జనవరి తేదీ 10 ప్రజాపాలన ప్రతినిధి :తులేకలాన్ గ్రామంలో మదార్ సావుల దర్గా ఉర్సు ఉత్సవాలలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ సత్తు వెంకటరమణారెడ్డి , మార్కెట్ కమిటీ చైర్మెన్ ఏర్పుల చంద్రయ్య , గ్రామస్తులు స్వాగతించి పెద్ద తుండ్ల గ్రామ ప్రజలు రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ చైర్మన్ సత్తు వెంకటరమణ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, పెద్ద తుండ్ల గ్రామానికి ఎన్నో సేవలు అందిస్తానని గ్రామస్తులకు నా వంతు సహకారాన్ని అందించి గ్రామాన్ని అభివృద్ధి చేసే విధంగా కృషి చేస్తారని యువతకు అన్ని రంగాల్లో సహకారాలు అందిస్తారని ఆయన తెలిపారు. పెద్ద తుర్ల గ్రామం నుండి రంగారెడ్డి జిల్లా వరకు చేరుకున్న నేను రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ చైర్మన్ గా విధులు సక్రమంగా నిర్వహించి పెద్దతుర్ల గ్రామానికి పేరు తెచ్చి పెడతానని ఆయన మనస్ఫూర్తిగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కృపేష్ , సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షులు బూడిద రాంరెడ్డి , ఎంపిటిసిల సంఘం అధ్యక్షుడు ఏనుగు భరత్ రెడ్డి , మండల బిఆర్ఎస్ అధ్యక్షుడు బుగ్గరాములు , సర్పంచ్ యాదగిరి , ఎంపిటిసి నాగమణి , ఉపసర్పంచ్ రాజిరెడ్డి , సొసైటీ వైస్ చైర్మెన్ రవీందర్ రెడ్డి , యూత్ అధ్యక్షుడు జెర్కోని రాజు , గ్రామశాఖ అధ్యక్షుడు గుజ్జ యాదగిరి , కార్యదర్శి జగదీశ్ తదితరులు. నూతనంగా నియమితులైన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ సత్తు వెంకటరమణారెడ్డి , మార్కెట్ కమిటీ చైర్మెన్ ఏర్పుల చంద్రయ్య లకు తులేకలాన్ గ్రామపంచాయితీ పాలకవర్గం నిర్వహించిన పౌరసన్మానం.

## జీ.ఓ. నం.76 సర్వే పారదర్శకంగా నిర్వహించాలి



మంచిర్యాల బ్యూరో, జనవరి 10, ప్రజాపాలన :సింగరేణి భూములలో ఏండ్ల తరబడి నివాసం ఉంటున్న ప్రజలకు భూములు క్రమబద్దీకరించి యాజమాన్య హక్కు కల్పించడం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జీ.ఓ. నం.76లో భాగంగా అందిన దరఖాస్తులపై పారదర్శకంగా సర్వే నిర్వహించి నివేదిక అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మధుసూదన్ నాయక్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సముదాయంలో గల జిల్లా అదనపు కలెక్టర్ చాంబర్లో మంచిర్యాల, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారులు వేణు, శ్యామలాదేవి, ఎస్.ఎల్.ఆర్. ఎ.డి. శ్రీనివాస్ తో కలిసి సర్వేయర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జీ.ఓ. నం. 76 క్రింద భూమి కొలతల కొరకు అభ్యర్థులు చేసుకున్న దరఖాస్తులకు సంబంధించి కొలతల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సిద్దిపేట జిల్లాలో ఘోర ప్రమాదం.. ఐదుగురి మృతి



హైదరాబాద్ బ్యూరో : కారు అదుపుతప్పి కల్వర్టును ఢీకొట్టి పక్కనే ఉన్న కాల్వలో పడటంతో ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన తెలంగాణ రాష్ట్రం సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం మునిగడప గ్రామంలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం... బీబీనగరర్, బొమ్మల రామారానికి చెందిన బోల్లు సమ్మయ్య, బొల్లు స్రవంతి, రాజమణి, భవ్యశ్రీ, లోకేష్, వెంకటేష్ కారులో వేములవాడ బయలుదేరారు. స్వామి దర్శనం అనంతరం తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో మునిగడప గ్రామంలో ఎల్లమ్మ గుడివద్ద పెద్ద మూల మలుపులో కొడకండ్ల నుంచి జగదేవపూర్ వద్ద కారు అదుపు తప్పి కొండపోచమ్మ కాలువ బ్రిడ్జిని ఢీకొట్టింది. అనంతరం పక్కనే ఉన్న కాలువలో పడిపోయింది. దాంతో కారులో ప్రయాణిస్తున్న ఆరుగురిలో బోల్లు సమ్మయ్య(40), బొల్లు స్రవంతి(32), రాజమణి(48), భవ్యశ్రీ(15), లోకేష్(12) అక్కడికక్కడే మృతి చెందారు. చికిత్స నిమిత్తం వెంకటేష్‌ను హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను గ్రామ పంచాయతీ సిబ్బంది, స్థానికుల సహకారంతో వెలికితీశారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాలను గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# కేంద్ర క్యాబినెట్ లోకి బండి సంజయ్..?



హైదరాబాద్, జనవరి 10 :ఉత్తర భారత దేశంలోనే కాదు, తెలంగాణలోనూ ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. చలి పెరుగుతోంది. జనం బయటకు రావాలంటే ఒణుకుతున్నారు. అయితే, దక్షిణాదిలో మరీ ముఖ్యంగా తెలంగాణలో రాజకీయాలు వేడెక్కిస్తున్నాయి. రాష్ట్రం ఎన్నికల సంవత్సరంలోకి ఎంట్రీ ఇచ్చేసిన నేపథ్యంలో ఎన్నికల వేడి అన్ని పార్టీల్లో, అందరు నాయకుల్లో కాక పుట్టిస్తోంది. ప్రధాన పార్టీలు వ్యూహాలకు పదును పెడుతున్నాయి. ఇతర పార్టీల విషయం ఎలా ఉన్నా భారతీయ జనతా పార్టీ మాత్రం ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు తెలంగాణలో అధికారంలోకి రాలేము అన్న నిర్ణయానికి వచ్చింది. అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితి ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటోంది. అంతర్గత సమస్యలతో సతమతమవుతోంది. పార్టీ నాయకులను సిబిఐ, ఈడీ కేసులు చుట్టుముట్టి ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. ఇక ప్రధాన ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ విషయానికి వస్తే, అంతర్గత కుమ్ములాటలు, జూనియర్ సీనియర్, పాత, కొత్త కొట్లాటలతో పార్టీ దినదిన ప్రవర్త మానంగా దిగజారి పోతోంది. పీసీసీ అధ్యక్షుడు రెంత్ రెడ్డి కాడి తన్నేసేందుకు సిద్ధమైనట్లు వార్తలొస్తున్నాయి. మరో వంక బీజేపీ దుబ్బాక, హుజురాబాద్ గెలుపుతో పాటుగా, ఇటీవల జరిగిన మునుగోడు ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌ను పడగొట్టి రెండవ స్థానంలోకి వచ్చింది. కాంగ్రెస్ సిట్టింగ్ స్థానంలో డిపాజిట్ కోల్పోవడంతో, పార్టీ మూడో స్థానానికి పడిపోయిందనే అభిప్రాయం బలపడిపోయింది. దీంతో బీజేపీలో జోష్ పెరిగింది. మునుగోడులో బీజేపీ అధికార భారాసకు గట్టి పోటీ ఇచ్చింది. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలను ఊరి కొకరు, వాడ కొకరు అన్నట్లు మోహరించినా, అధికార భారస అభ్యర్థి 10,000 స్వల్ప మెజారిటీతో మాత్రమే బయట పడ్డారు. సో .. తెలంగాణలో కాషాయ జెండా ఎగరేసేందుకు ఇదే సరైన సమయమని, ఈ అవకాశం వదులు కుంటే ఇక మళ్ళీ ఇప్పట్లో మరో అవకాశం రాకపోవచ్చని బీజేపీ ఎట్టి పరిస్తితిలో గెలిచి తీరాలనే పట్టుదలతో పావులు కదుపుతోంది. బీజేపీ అగ్ర నాయత్వం తెలంగాణపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించింది. ఇప్పటికే, రాష్ట్రంలో జాతీయ కార్యవర్గ సమావేశాలు నిర్వహించడం మొదలు బలాబలాలను బేరీజు వేసుకునేదుకు, మునుగోడు ఉప ఎన్నిక కోరి తెచ్చుకునేంత వరకు... చాలా చాలా ప్రయోగాలు చేసింది. చేస్తోంది. ఇక ఇప్పుడు తాజాగా మరో పావు కదపటానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. త్వరలో చేపట్టనున్న కేబినెట్ విస్తరణలో... తెలంగాణకు ఒక బెర్త్‌ను ఖరారు చేసిందని విశ్వసనీయ సమాచారం. 2019 ఎన్నికల్లో తెలంగాణ నుంచి బీజేపీ తరఫున నలుగురు ఎంపీలు గెలుపొందారు. సికింద్రాబాద్ నుంచి కిషన్ రెడ్డి, కరీంనగర్-బండి సంజయ్ం, ఆదిలాబాద్-సోయం బాపురావు, నిజామాబాద్-ధర్మపురి అరవింద్ గెలిచారు. కిషన్ రెడ్డి ఇప్పటికే కేంద్ర మంత్రిగా ఉన్నారు. కరీంనగర్ నుంచి ఎంపీగా గెలిచిన బండి సంజయ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నారు. బండి సంజయ్ నాయకత్వం పట్ల ప్రధాని మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు పూర్తి విశ్వాసం వుంది. ఇక మిగిలిన ఇద్దరిలో ఒకరికి మంత్రి పదవి ఖాయమని ప్రచారం జరిగింది కానీ, తాజా సమాచారం ప్రకారం, బండి సంజయ్ ని కేంద్ర క్యాబినెట్ లోకి తీసుకుని ఆయన స్థానంలో ఈటల రాజేందర్ కు పార్టీ పగ్గాలు అప్పగించాలని అధిష్టానం నిర్ణయించినట్లు తెలుస్తోంది. నిజానికి బండి సంజయ్ పార్టీ అధ్యక్ష పదవిలోకి వచ్చిన తర్వాతనే పార్టీలో ఊపొచ్చింది. దుబ్బాక, జీహెచ్ఎంసి, హుజురాబాద్ విజయాలు పార్టీకి మరింత ఊపునిచ్చాయి. అందుకే మళ్ళీ ఎన్నికల వరకు బండినే అధ్యక్ష పదవిలో కొనసాగించాలని ముందు నిర్ణయించినా భారాస, కాంగ్రెస్ పార్టీలలో చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో ఈటలకు పార్టీ పగ్గాలు అప్పగిస్తే భారాస, కాంగ్రెస్ పార్టీలపై 'పైచేయి' సాధించడం మరింత తేలిక అవుతుందని పార్టీ బావిస్తున్నట్లు చెపుతున్నారు. అందుకే బండికి కేంద్ర మంత్రి వర్గంలో స్థానం కల్పించి, ఈటలకు పార్టీ పగ్గాలు అప్పగించాలనే ఉభయ తారక నిర్ణయం తీసుకుందని అంటున్నారు. ఈటల రాజేందర్ కు భారాస లోగుట్లన్నీ క్షుణ్ణంగా తెలుసు. ఉద్యమ పార్టీగా తెరాస పురుడు పోసుకున్నటి నుంచి, కుటుంబ పార్టీగా రూపాంతరం చెందేవరకు, అనంతర పరిణామాలు అన్నీఈటలకు కొట్టిన పిండి. అంతే కాకుండా ఇప్పటికీ గులాబి పార్టీ నేతలు అందరితోనూ ఈటలకు సన్నిహిత సంబంధాలున్నాయి. అలాగే ఒక బీసీ నాయకుడిగా రాష్ట్ర వ్యాప్తంగా ఈటల అన్ని వర్గాల ప్రజలకు పరిచయం ఉన్న వ్యక్తి. ఇలా అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుని రాజేందర్ కు తెలంగాణ బిజెపి అధ్యక్ష పదవిని ఇచ్చి, ముఖ్య మంత్రి అభ్యర్థిగా ఫోకస్ చేస్తే బాగుంటుందనే ఆలోచనలో అధిష్టానం ఉన్నట్లు తెలుస్తోంది. జనవరి 16,17 తేదీలలో బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలు ముగిసిన వెంటనే ప్రధాని మోడీ మంత్రి వర్గ విస్తరణ ముహూర్తం ఉంటుందని అంటున్నారు. ఈ నెల 29 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు కూడా ఉన్నందున ఈ లోగానే మంత్రి వర్గ విస్తరణ ఉంటుదని అంటున్నారు. అలాగే ఈ ఏడు జరగా నున్న9 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, 2024 లోక్ సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఇటు పార్టీలో, అటు కేంద్ర మంత్రి వర్గంలో భారీ మార్పుల ఉంటాయని అంటున్నారు.

## కొత్త పొత్తులతో ఎవరి సీటుకి ఎసరొస్తుందనే లెక్క

హైదరాబాద్, జనవరి 10 :మామూలుగానే రాజకీయాల్లో ఇదిగో పులి అంటే అదిగో తోకన్నట్లు ఉంటుంది. అలాంటిది పదేపదే జరుగుతున్న ప్రచారం ఇద్దరు అధినేతల కలయికతో మరింత బలపడకుండా ఉంటుందా? ఏపీలో అదే జరుగుతోంది. చంద్రబాబు-పవన్‌కల్యాణ్ భేటీతో సైకిల్ పార్టీలో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. నో డౌట్.. ఇక ఫ్రెండ్‌షిప్ పక్కా అని ఫిక్సయిపోతున్నారట తమ్ముళ్లు. పవన్‌కల్యాణ్‌తో గతంలోనూ చంద్రబాబు భేటీ అయ్యారు. హోటల్‌కొచ్చి మరీ కలిసి జనసేనానికి సంఘీభావం ప్రకటించారు. అయితే తర్వాత చోటుచేసుకున్న పరిణామాలు కేడర్‌ని గందరగోళంలో పడేశాయి. చంద్రబాబును కలిసిన తర్వాత పవన్‌కల్యాణ్ ప్రధాని మోదీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు.తర్వాత పవన్ చేసిన నర్మగర్భ వ్యాఖ్యలతో టీడీపీతో పొత్తు ప్రయత్నాలకు బ్రేక్‌పడిందన్న సంకేతాలు వెళ్లాయి. కానీ హైదరాబాద్‌లో తాజా మీటింగ్ తర్వాత ఇద్దరు నేతలు చేసిన వ్యాఖ్యలతో రెండు పార్టీల మధ్య పొత్తు పొడుస్తోందంటున్నారు.పొత్తులపై ఇప్పుడే ఏ నిర్ణయం తీసుకోలేదని చెబుతున్నా కేడర్‌కి మాత్రం నేతలనుంచి సంకేతాలున్నాయంటున్నారు. ఇద్దరి భేటీ తర్వాత వైసీపీ నాయకులకు పవన్ తరపున గట్టి కౌంటర్లు ఇచ్చారు టీడీపీ నేతలు. మరోవైపు చంద్రబాబు-పవన్‌కల్యాణ్ ఏం మాట్లాడుకున్నారు, ఎలా ముందుకెళ్లబోతున్నారన్న దానిపై రాష్ట్ర స్థాయి నాయకులకు ఫోన్లు చేసి ఆరాతీస్తున్నారట తమ్ముళ్లు.పొత్తులపై ముందుగానే తేల్చేస్తే క్లారిటీ ఉంటుందంటున్నారు తమ్ముళ్లు. ఎన్ని సీట్లు ఇవ్వాల్సి వస్తుందో, ఎక్కడెక్కడ వదులుకోవాల్సి వస్తుందో ఓ అంచనా ఉంటే గందరగోళానికి తావుండదన్న మాట టీడీపీ నేతలనుంచి వస్తోంది. ఏపీలో 30 నియోజకవర్గాలకు టీడీపీ ఇంకా ఇంచార్జిలను నియమించలేదు. గ్రూపు తగాదాలతో పాటు, టికెట్‌కి పోటీ ఉన్నచోట లేనిపోని తల్నొప్పులు ఎందుకని ఇంచార్జిల విషయంలో ఆచితూచి అడుగులేస్తున్నారట చంద్రబాబు. ఇప్పుడు పొత్తు తేలితే అలాంటి నియోజకవర్గాలపైనా ఓ క్లారిటీ రావచ్చంటున్నారు.జనసేనతో పొత్తు పెట్టుకుంటే ఆ పార్టీకి ఎన్ని సీట్లు ఇస్తారు.. ఎక్కడెక్కడ ఇస్తారన్నదానిపైనా అప్పుడే చర్చ మొదలైందని సమాచారం. ప్రధానంగా ఉభయగోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో జనసేనకు ఎక్కువసీట్లు ఇచ్చే అవకాశం ఉందని కేడర్ చర్చించుకుంటోంది. అయితే ఇప్పటికే టీడీపీ ఇంచార్జిలు ఫుల్ ఫోకస్ పెట్టి పనిచేసుకుంటున్న సీట్లు ఇవ్వాల్సి వస్తే పరిస్థితి ఏంటన్నదానిపై తమ్ముళ్లు గుసగుసలాడుకుంటున్నారు. టీడీపీ, జనసేన రెండూ బలంగా ఉన్న చోట ఒకరికి సీటిస్తే మరొకరి పరిస్థితి ఏంటనే చర్చ కూడా రెండు పార్టీల్లో అప్పుడే మొదలైందట.పొత్తుల అంశం అప్పుడే కాదని రెండు పార్టీల నేతలు దాటవేస్తున్నా ముందే తేలిపోతే బావుంటుందన్న మాట రెండువైపులనుంచీ వినిపిస్తోంది. చివరి నిమిషం దాకా పొత్తుల విషయం తేల్చకుంటే రెండు పార్టీల మధ్య గ్యాప్ వచ్చి అసలుకే ఎసరొచ్చే ప్రమాదం ఉందని తమ్ముళ్లు అంటున్నారు. పొత్తుల అంశంపై టెలికాన్ఫరెన్స్‌లో టీడీపీ నాయకులతో చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేసినట్లు కొందరు చెబుతున్నారు. ఎక్కువకాలం సస్పెన్స్ పెట్టకుండా వీలైనంత త్వరగా పొత్తులపై నిర్ణయం తీసుకునేలా రెండు పార్టీల నాయకులు ముందుకెళ్తున్నారని చెబుతున్నారు.

## అత్యంత సురక్షిత జిల్లాగా నిలిచిన అదిలాబాద్..

ఆదిలాబాద్, జనవరి 10 :తెలంగాణ రాష్ట్రంలో మారుమూల ప్రాంతంగానే కాక మావోయిస్టు ప్రాబల్యం ఎక్కువగా ఉన్న ఆదిలాబాద్ జిల్లా ఎవరూ ఊహించని రీతిలో అత్యంత అరుదైన ఘనతను తన సొంతం చేసుకుంది. తెలంగాణ రాష్ట్రంలోనే అత్యంత సురక్షితమైన జిల్లాగా అగ్రస్థానం సాధించింది అదిలాబాద్. ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి సామాజిక ప్రగతి సూచిక ఇటీవల విడుదల చేసిన 'సురక్షితమైన జిల్లాల నివేదిక'లో అదిలాబాద్ కూడా ఉంది. ఇంకా ప్రత్యేకంగా చెప్పుకోదగిన విషయం ఏమిటంటే.. 'వ్యక్తిగత భద్రత సూచిక'లో దేశంలోనే అత్యంత సురక్షితమైన జిల్లాల జాబితాలో ఐదో స్థానాన్ని అదిలాబాద్ దక్కించుకుంది. ఆదిలాబాద్ జిల్లా పోలీసు వ్యవస్థ పనితీరుకు నిదర్శనంగా ఈ భద్రత ర్యాంకింగ్స్ రావడం విశేషం. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డీ ఉదయ్ కుమార్ రెడ్డికి ప్రముఖుల ద్వారా అభినందనలు వెల్లువెత్తాయి.అయితే సామాజిక ప్రగతి సూచిక ప్రకారం.. వందకి 89.89 మార్కులు సాధించిన నాగాలాండ్‌లోని మోకోక్చుంగ్ జిల్లా దేశంలోనే అత్యంత సురక్షితమైన జిల్లాగా మొదటి స్థానంలో నిలిచింది. 89.64 మార్కులతో గురుదాస్పూర్(పంజాబ్), 89.62 మార్కులతో సేనాపతి(మణిపూర్), 86 మార్కులతో ఫిరోజ్‌పూర్(పంజాబ్), 85 మార్కులతో ఆదిలాబాద్(తెలంగాణ) జిల్లాలు వరుస స్థానాల్లో నిలిచాయి. ఆదిలాబాద్ తర్వాత 81 పాయింట్లతో కరీంనగర్ జిల్లా రాష్ట్రం నుంచి మెరుగైన స్థానంలో నిలిచింది. ఇక రాష్ట్ర జాబితాలో ఆదిలాబాద్, కరీంనగర్ వరుసగా తొలి రెండు స్థానాల్లో నిలవగా.. భద్రాద్రి (44), సిరిసిల్ల(47), సూర్యాపేట(48) అట్టడుగు స్థానాల్లో ఉన్నాయి.సామాజిక ప్రగతి సూచిక జరిపిన ఈ సర్వేలో 89 సూచికలను పరిగణనలోకి తీసుకున్నారు. వీటిలో ముఖ్యంగా.. మహిళలు, పిల్లలపై జరిగే నేరాలు, సైబర్ క్రైమ్, హత్యలు, రోడ్డు మరణాలు, హింసాత్మక నేరాలు తదితర అంశాలను వ్యక్తిగత భద్రత పరిమితిని లెక్కించేందుకు పరిగణనలోకి తీసుకున్నారు. తెలంగాణ వ్యక్తిగత భద్రత స్కోరు 42గా ఉండగా ఆదిలాబాద్ జిల్లా స్కోరు 85గా ఉండి రాష్ట్రానికే గర్వకారణంగా నిలిచింది.

## ఎన్నికల వేళ కాంగ్రెస్.. బీజేపీ మధ్య కొత్త వివాదం

బెంగళూరు, జనవరి 10 :కర్నాటక అసెంబ్లీ ఎన్నికల వేళ కాంగ్రెస్ ? బీజేపీ మధ్య కొత్త వివాదం చెలరేగింది. కాంగ్రెస్ నేత, మాజీ సీఎం సిద్ధరామయ్యపై బీజేపీ రాసిన 'సిద్ధా నిజకనసుగలు' అనే పుస్తకం విడుదలపై బెంగళూర్ సెషన్స్ కోర్టు స్టే విధించింది. బీజేపీ నేతలు ఈ పుస్తకాన్ని విడుదల చేసేందుకు రెడీ అయిన సమయంలో కోర్టు స్టే విధించడంతో రాజకీయాలు మరింత వేడెక్కాయి. సిద్ధరామయ్య టిప్పు సుల్తాన్ లాంటి వాడని, ఆయన సీఎంగా ఉన్నప్పుడు చాలామంది బీజేపీ కార్యకర్తలను హత్య చేయించారని పుస్తకంలో రాశారు. ఈ పుస్తకంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు సిద్ధరామయ్య. తనను అప్రతిష్టపాలు చేసేందుకే ఈ పుస్తకాన్ని బీజేపీ రిలీజ్ చేయిస్తోందన్నారు. సిద్ధరామయ్యకు మద్దతుగా కాంగ్రెస్ కార్యకర్తలు, ఆయన సామాజిక వర్గానికి చెందిన కురుబ సంఘం నేతలు ఆందోళనకు దిగారు. బుక్ రిలీజ్ ఫంక్షన్ వేదికను ముట్టడించేందుకు ప్రయత్నించారు. పోలీసులు వాళ్లను అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇదే సమయంలో సిద్ధరామయ్య కొడుకు పుస్తకం రిలీజ్‌పై కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా.. ధర్మాసనం స్టే విధించింది.కర్నాటక అసెంబ్లీ ఎన్నికలకు ముందు తనను అవమానించే ఉద్దేశ్యంతో "సిద్దు నిజకనాసుగలు" అనే పేరుతో తన గురించి పుస్తకం రాశారని.. ఈ పుస్తకం తన పరువుకు నష్టం కలిగించేదని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సిద్ధరామయ్య పేర్కొన్నారు. దీనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆలోచిస్తున్నట్లు శాసనసభ ప్రతిపక్ష నేత వివరించారు. మరోవైపు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కోలార్ నుంచి పోటీ చేస్తానని సిద్ధరామయ్య సోమవారం ప్రకటించారు. టిప్పుతో పోలిన చిత్రాలతో విడుదల చేస్తున్న ఈ పుస్తకం వెనుక బీజేపీ ఉందని ఆరోపించారు.విశ్వసనీయవర్గాల సమాచారం ప్రకారం.. ఈ పుస్తకంలో సిద్ధరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగిన పాలన, బుజ్జగింపు రాజకీయాలు, ముఖ్యమంత్రి ఉన్న సమయంలో తీసుకున్న నిర్ణయాలు. వివాదాస్పద, మతపరమైన సున్నితమైన విషయాల గురించి రాసినట్లు పేర్కొంటున్నారు.

## మొన్న చూసింది ట్రైలరే..

(మొదటి పేజీ తరువాయి)

కర్ణాటక, మహారాష్ట్ర మధ్య సరిహద్దు గొడవ నడుస్తుందన్న కేటీఆర్.. ఆ రెండు రాష్ట్రాల్లో ఉన్నది బీజేపీ ప్రభుత్వమేనన్నారు. రాష్ట్రాల గొడవ పరిష్కరించని మోదీ రష్యా, ఉక్రెయిన్ యుద్ధం ఆపారా? అని ప్రశ్నించారు. 14 మంది ప్రధానులు చేసిన అప్పు.. మోదీ ఒక్కరే చేశారని విమర్శించారు. కిషన్‌రెడ్డి కరోనా సమయంలో కుర్‌కురే ప్యాకెట్లు పంచారని విమర్శించిన కేటీఆర్.. తెలంగాణకు కేంద్ర నిధుల విషయంలో సవాల్ విసిరారు. రాష్ట్రం నుంచి కేంద్రానికి రూ.1.68లక్షల కోట్లు వెళ్లాయని, కేంద్రం తెలంగాణకు రూ.2లక్షల కోట్లు ఇచ్చిందన్నారు. నేను చెప్పింది తప్పని నిరూపిస్తే మంత్రి పదవికి రాజీనామా చేస్తానన్నారు. గుజరాత్ వాళ్లు వస్తే చెప్పులు మోయడానికి పని చేస్తారని, నాలుగేళ్లలో కరీంనగర్‌కు ఎంపీగా ఉండి బండి సంజయ్ ఏం చేశాడో చెప్పాలని డిమాండ్ చేశారు. ట్రిపుల్ ఐటీ, నవోదయ పాఠశాలలు తీసుకువచ్చావా? అంటూ నిలదీశారు. రాజరాజేశ్వరస్వామికి రూ.10 చందా అయినా రాయించావా? అంటూ ధ్వజమెత్తారు. ఈ సారి కరీంనగర్ పార్లమెంట్‌పై గులాబీ జెండాను ఎగురవేద్దామని, సిరిసిల్ల నుంచి విజయయాత్ర ప్రారంభించి.. ఇక్కడి నుంచే కరీంనగర్ గులాబీ జెండా ఎగురవేద్దామని కేటీఆర్ పిలుపునిచ్చారు.

## టిల్ హార్స్ పాఠశాలలో సంతూర్ ముగ్గుల పోటీలు



జన్నారం, జనవరి 10, ప్రజాపాలన: మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలోని లిటిల్ హార్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో అక్షిత ఏజెన్సీ వారి ఆధ్వర్యంలో విప్రో సంతూర్ వారి సౌజన్యంతో సంక్రాంతి సంబరాలలో భాగంగా మంగళవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. సంక్రాంతి పండుగా ఉట్టి పడేలా వేసిన ముగ్గులు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధాగా –స్థానిక జెడ్పిటిసి ఎర్ర చంద్ర శేఖర్ హాజరై గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇలాంటి పోటీల వలన మహిళలో ఉన్న సృజనాత్మకత బయటకు వస్తుందని, ఈ కార్యక్రమ నిర్వహకులకు అభినందనలు తెలియజేసారు. పోటీలలో సుమారు 70 మంది ఉత్సహవంతంగా పాల్గోన్నారు. మొదటి బహుమతి శృతికి మిక్సీ, రెండవ బహుమతి దివ్య కు కుక్కర్ ,తృతీయ బహుమతి అనిత కు అందుకోవడం జరిగిందని తెలిపారు. ఈ ముగ్గుల పోటీలలో పాల్గోన్న ప్రతి ఒక్కరికి కన్సోలేషన్ బహుమతి అందజేసారు. మిగలిన వారికి విప్రో సాఫ్ట్ టచ్, కిట్టులు చిరు బహుమతులు అందజేసారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, సంతూర్ డిస్ట్రిబూటర్ రాగి శ్రీధర్, విప్రో %యూవీ% షారూఖ్ సయ్యద్, న్యాయ నిర్ణేతలు శ్రీలత, వెంకట్రాజం పాల్గొన్నారు

## పండుగకు ఊరు వెళ్తున్నారా... జర పైలం

**పట్టణ సీఐ టంగుటూరి శ్రీను**




వికారాబాద్ బ్యూరో 10 జనవరి ప్రజా పాలన : సంక్రాంతి పండుగ సెలవులకు ఊరు వెళ్లే వారు సూచించిన నిబంధనలను తు.చ. తప్పకుండా పాటించాలని పట్టణ సిఐ టంగుటూరి శ్రీను మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ సిఐ టంగుటూరి శ్రీను మాట్లాడుతూ ఉదయం వేళ రద్దీ పేపర్లు, ఖాళీ సంచులు, పూల మొక్కలు, హర్ ఏక్ మాల్ వస్తువులను విక్రయించే వారి పై "నిఘా " పెట్టాలని సూచించారు. రాత్రయితే అనుమానంగా సంచరించే వారిని పలుకరించాలన్నారు. శివారు ప్రాంత కాలనీలలో తాళం వేసిన ఇండ్లను అపరిచిత వ్యక్తులు ఉదయం వేళ వెతకటం,రాత్రి వేళ చోరీలకు పాల్పడుతున్నారన్నారు. విలువైన వస్తువులను పక్కింటి వారికి ఇచ్చినమ్మి వెళ్లకూడదని హెచ్చరించారు. ఇరుగు పొరుగు వారిని ఇంటిని కనిపెట్టి ఉండమని చెప్పాలని తెలిపారు. వీలైనంత త్వరగా ప్రయాణం ముగించుకొని వచ్చేలా ప్రణాళిక వేసుకోవాలని హితవు పలికారు. పక్కింటి వారి ద్వారా ఇంటికి సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని కోరారు. ఇంట్లోని కుటుంబ సభ్యులు వెళ్లినప్పుడు ఇంట్లో ఉన్న మహిళలు, వృద్ధులు "అపరిచితులు " సమాచారం పేరుతో వస్తే నమ్మవద్దన్నారు. ఊరు వెళ్లేటప్పుడు ఖరీదైన వస్తువులు ఉంచకపోవడమే మంచిది. బ్యాంక్ లాకర్లో పెట్టుకోవడం మరవద్దన్నారు. కాలనీల వారిగా "గస్తీ " దళాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. తాళం వేసి ఊరు వెళ్లే ముందు మీసమీప పోలీస్ స్టేషన్ లో సమాచారం అందించాలని చెప్పారు. పోలీస్ శాఖ వారికి దొంగతనాలపై అనుమానితుల సమాచారం అందించి దొంగతనాల నివారణకు సహకరించాలన్నారు. ప్రత్యేకంగా మీ చుట్టు ప్రక్కల వారి ల్యాండ్ ఫోన్ నెంబరు, సెల్ ఫోన్ నెంబర్లు మీ దగ్గర ఉంచుకోగలరని స్పష్టం చేశారు. ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వదలుచుకునేవారు మీ సమీప పోలీస్ స్టేషన్లను సంప్రదించండి. డయల్ 100 ను సద్వినియోగం చేసుకోండి.

## హైకోర్టు న్యాయవాదుల సంఘం నిరసన




నిజామాబాద్: న్యాయవాదులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా హైకోర్టు వద్ద తెలంగాణ హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు రఘునాథ్ అధ్వర్యంలో లంచ్ టైమ్ లో నిరసన ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ నిజామాబాద్, వరంగల్ జిల్లాల్లో న్యాయవాదులపై అనుచితంగా ప్రవర్తించిన పోలీసు అధికారులపై తక్షణమే చట్టపరమైన చార్యలు తీసుకురావాలని, న్యాయవాదుల రక్షణ చట్టం ను అమలు చేయాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో న్యాయవాదులు జెల్లి నరేందర్, మంచర్ల విష్ణు వర్ధన్ , భీమారావు, శరత్, డాక్టర్ ఎన్ రవి, కెవి రామారావు, మంచాల లక్ష్మణ్, సత్యనారాయణ, శారద తదీతరులు పాల్గొన్నారు

## అంగన్వాడి ఎన్ హెచ్ టి ఎస్ ఆప్ ను రద్దు చేయాలి

**సిఐటియు రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్**



చేవెళ్ల జనవరి10, ( ప్రజా పాలన):అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడి చేవెళ్ల ప్రాజెక్టు సిడిపిఓ శోభారాణి గారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ మాట్లాడుతూ దేశంలోని 25 రాష్ట్రాలలో ఎక్కడ కూడా ఎన్ హెచ్ టి ఎస్ అప్ లేదని కేవలం పోషణ్ ట్రాకర్ ఆప్ మాత్రమే ఉపయోగిస్తున్నారని కానీ తెలంగాణ రాష్ట్రంలో ఎన్ హెచ్ టి ఎస్ యాప్ అమలు చేస్తూ అంగన్వాడి టీచర్లను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. అంగన్వాడి కేంద్రాలలో చిన్నపిల్లలు గర్భిణీ స్త్రీలు పౌష్టికాహారం ఇవ్వాలని స్థాపించారు వాటికి నాణ్యమైన సరుకులు మాత్రం సరఫరా చేయడం లేదు కానీ అనేక యాత్ర ద్వారా అంగన్వాడి టీచర్లను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. ఎన్ హెచ్ టి ఎస్ యాప్ ను తెలంగాణ రాష్ట్ర కమిటీ వ్యతిరేకిస్తూ ఆందోళనకు పిలుపునిచ్చిందని తెలియజేశారు. అదేవిధంగా 60 సంవత్సరాలు పైబడిన అంగన్వాడి టీచర్లకు ఎలాంటి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇన్సూరెన్స్ సౌకర్యం ఈఎస్ఐ,పిఎఫ్ ఏవీ లేవని కానీ వారితో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెట్టిచాకిరి చేయించుకుంటున్నాయని అన్నారు అంగన్వాడి టీచర్ల సమస్యలపై జనవరి 27న సిడిపిఓ కార్యాలయం ముందు ధర్నా ఫిబ్రవరి 13న రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు మార్చి మొదటి వారంలో సీఎం క్యాంప్ ఆఫీస్ ప్రగతి భవన్ ముట్టడి కార్యక్రమాలను రాష్ట్ర కమిటీ రూపొందించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల షాబాద్ శంకర్పల్లి మొయినాబాద్ మండలాల అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు

## అధికారపార్టీకి ప్రత్యామ్నాయ పార్టీ బి ఎన్ పి యే: పుట్టా పద్మారావు...




హైదరాబాద్ (ప్రజాపాలన ప్రతినిధి ):దేశ, రాష్ట్ర రాజకీయాలలో అధికార పార్టీ లకు ప్రత్యామ్నాయ పార్టీ బి ఎన్ పి యే అన్నారు బహుజన నేషనల్ పార్టీ (బీఎన్పీ) రాష్ట్ర అధ్యక్షుడు, హై కోర్టు న్యాయవాది పుట్టా పద్మారావు.మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో బహుజన నేషనల్ పార్టీ (బీఎన్పీ) రాష్ట్ర శాఖను ప్రకటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుజరాత్ నుంచి వచ్చిన 21 మంది వ్యాపారులకు దేశం లో, రాష్ట్రం లో అన్నీ అప్పగిస్తున్న తీరు ఉందని. ప్రభుత్వ బడులు మూసేస్తే సామాన్యులు, దళిత గిరిజనుల చదువుకునేది ఎలా అని అన్నారు. జాతీయ స్థాయిలో రాజకీయ ప్రత్యామ్నాయం కోసం జరిపే నూతన బహుజన ఉద్యమాన్ని. నిర్మిస్తున్నామని ఆయన తెలిపారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 130 కోట్ల ప్రజలకు చెందిన ప్రజా వ్యతిరేక విధానాలు చేపడుతుందని నాడు కాంగ్రెస్ బ్యాంకులను జాతీయం చేయగా 50 కోట్ల మందికి ఊరట లభించిందని,మోదీ రాగానే కొన్ని ప్రైవేట్, మరికొన్ని ప్రభుత్వ సంస్థలను విలీనం చేశారు. రైల్వే, ప్రభుత్వ రంగ సంస్థలు పోయాయన్నారు.ఉన్నత కులాల్లో కొందరికి మాత్రమే ఉపయోగపడేలా సంపద కొద్ది మంది చేతుల్లోకి వెళ్లేలా చేశారు. మరి దేశం ఎలా అభివృద్ధి జరుగుతోంది. వృద్ధిలో 160 స్థానములో ఉంది. యువత నిరాశా నిస్పృహలతో ఉన్నారు. బీజేపీకి ప్రత్యాయమంగా ఉండాలని ఏడాది కాలంగా దేశ వ్యాప్తంగా పర్యటించి గత నవంబర్ 26న ప్రారంభం అయిందని. పార్టీ ద్వారానే బహుజన వర్గాలను న్యాయం జరుగుతుందని భావించి వెయ్యి మంది న్యాయవాదులం అడుగు వేస్తున్నాం. నిరుద్యోగ యువతకు మేలు జరిగేలా ముందుకు వెళతామన్నారు.. కంపెనీల్లో ఉద్యోగాలు కాదు పరిశ్రమల స్థాపనలో వాటా కావాలి. 10 మంది పార్లమెంటరీ ఇంచార్జీలను ప్రకటించారు. దేశంలో మేము ఏ పార్టీకి వ్యతిరేకంగా కాదు, ఏ పార్టీ నుంచి విడిపోలేదు. బీఎస్పీ మిత్ర పార్టీయే గానీ శత్రు పార్టీ కాదు. ఈ కార్యక్రమం లో ప్రో.వెంకటేశ్వర్లు, ఎర్రమల రాములు,మనోహర్, భీంసేనా నేత చేగూరి రాజు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులను అన్ని రంగాలలో తీర్చిదిద్దే వేదిక "పాఠశాల"

**జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాహుల్**



మంచిర్యాల బ్యూరో, జనవరి 10, ప్రజాపాలన :విద్యార్థులను అన్ని రంగాలలో తీర్చిదిద్దే వేదిక "పాఠశాల" అని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాహుల్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ట్రినిటి పాఠశాలలో ఏర్పాటు చేసిన వార్షిక క్రీడా ఉత్సవాలకు జిల్లా క్రీడా, యువజన శాఖ అధికారి శ్రీకాంత్రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ గాజుల ముఖేష్ గౌడ్, పాఠశాల ప్రిన్సిపల్ జాన్ థామస్తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులను అన్ని రంగాలలో తీర్చిదిద్దే వేదిక పాఠశాల అని, పాఠశాల స్థాయి నుండి జీవితంలో అన్ని రంగాలలో విజయం సాధించే దిశగా విద్యార్థులకు కృషి చేయాలని, ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించడంలో పట్టుదల, చిత్తశుద్ధితో ముందుకు సాగాలని తెలిపారు. ఆటలలో గెలుపు, ఓటములు సహజమని, క్రీడల మానసిక ఉల్లాసం, శారీరక ధారుఢ్యం కలుగుతుందని, విద్య రాణించడంలో ఎంతో దోహదపడతాయని తెలిపారు. అంతకు ముందు తెలంగాణ రాష్ట్ర జూనియర్ వాలీబాల్ కెప్టెన్, జాతీయ క్రీడాకారుడు, ట్రినిటి పాఠశాల పూర్వ విద్యార్థి అంకం అనుదీప్ న్ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ బిజు కురివిల్లా, డైరెక్టర్ సుమనాజాన్, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## బిఎల్ వర్మకు మర్యాదపూర్వకంగా కలిసిన బిజెపి పార్టీ



మధిర జనవరి 10 ప్రజాపాలన ప్రతినిధి నియోజకవర్గ పరిధిలో మంగళవారం నాడు బిజెపి పార్టీ నాయకుల ఆధ్వర్యంలో కేంద్ర మంత్రివర్యులు, బి ఎల్, వర్మ ని మర్యాద పూర్వకంగా కలసిన బీజేపీ మధిర నాయకులు,ఖమ్మం జిల్లా పర్యటన లో బాగంగా, బోనకల్ బిసి వేల్ఫేర్ హాస్టల్ సందర్శకు వచ్చిన లిబి ఎల్, వర్మలి మధిర బిజెపి పార్టీ నాయకులు స్వాగతం పలుకుతూ మర్యాదపూర్వకంగా కలవటం జరిగింది, ఈ సందర్భంగా బిఎల్ వర్మ మాట్లాడుతూ నియోజకవర్గం వివరాల్ అడిగి నియోజకవర్గ అభివృద్ధిలో భారతీయ జనతా పార్టీ సహకరిస్తుందని వారు తెలిపారుఈ కార్యక్రమం లోమధిర అసెంబ్లీ కన్వీనర్, లిఏలూరి నాగేశ్వరావులి బీజేపీ జిల్లా కార్యదర్శి, లిచిలువేరు సాంబశివరావులి, పట్టణ అధ్యక్షులు, లిపాపట్ల రమేష్లి, జిల్లా కార్యవర్గ సభ్యులు, లికుంచం కృష్ణారావు,లి దళిత మోర్చా జిల్లా అధికారప్రతినిధి, లికనపర్తి ప్రకాష్లి, పట్టణ ఉపాధ్యక్షలు, లిమాదిరాజ్ సాయిరామ్,లి తదితరులు.

## కమల్ రాజ్ కి ముఖ్యమంత్రి కేసీఆర్ అభయం




మధిర జనవరి 10 (ప్రజా పలన ప్రతినిధి) :మధిర బిఆర్ఎస్ టికెట్ విషయంలో జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజుకు ముఖ్యమంత్రి నుండి పూర్తిగా అభయం లభించినట్లు బిఆర్ఎస్ ముఖ్య నేతలు చర్చించుకుంటున్నారు. సోమవారం హైదరాబాదులో జరిగిన ఖమ్మం జిల్లా ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లా పరిషత్ చైర్మన్ హొదాలో లింగాల కమల్ రాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్, లింగాల కమల్ రాజు భుజం మీద చేయి వేసి గో హెడ్ కమల్ రాజ్ అన్నట్లు తెలియటంతో బిఆర్ఎస్ నేతలు సంతోషంలో మునిగిపోతున్నారు. ఇప్పటి వరకు పార్టీలో కమల్ రాజుకి పోటీదారులుగా ఉన్న డాక్టర్ కోటా రాంబాబు ఉద్యమకారుడు బొమ్మెర రామ్మూర్తి ఇద్దరూ దాదాపుగా పొంగులేటి శీనన్న వెంటనే నడిచేందుకు సిద్ధం కావడంతో కమల్ రాజుకు బిఆర్ఎస్ పార్టీలో పోటీ దారులు లేకుండా పోయింది. ఒకవైపు ఈనెల 18వ తేదీన ఖమ్మంలో నిర్వహించే బీఆర్ఎస్ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ టిఆర్ఎస్ శ్రేణులతో సమావేశం నిర్వహిస్తూ, మరోవైపు పొంగులేటితో క్యాడర్ వెళ్లకుండా ముఖ్యమైన గ్రామాల్లో ఆత్మీయ సమావేశాలు నిర్వహించేందుకు కమల్ రాజ్ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ శ్రేణులు చెబుతున్నారు. అదేవిధంగా సిపిఎం సిపిఐతో బిఆర్ఎస్ పార్టీకి పొత్తు ఉంటుంది గనుక ఆ పార్టీ నాయకులతో కూడా కలిసి పనిచేసేందుకు క్యాడర్ను సిద్ధం చేస్తున్నారు. అనూహ్యంగా ముఖ్యమంత్రి నుండి కమల్ రాజుకి అభినందనలు రావడంతో ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది.

## పదిలో 100 శాతం ఉత్తీర్ణం సాధించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మధుసూదన్ నాయక్**



మంచిర్యాల బ్యూరో, జనవరి 10, ప్రజాపాలన :2022 – 23 విద్యా సంవత్సరానికి గాను త్వరలో జరుగనున్న 10వ తరగతి వార్షిక పరీక్షలలో విద్యార్థులు 100 శాతం ఉ త్తీర్ణత సాధించే దిశగా అధికారులు కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మధుసూదన్ నాయక్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సముదాయంలో గల జిల్లా అదనపు కలెక్టర్ చాంబర్లో తన తండ్రి రాగ్యానాయక్ జ్ఞాపకార్థం షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతిగృహాల అధికారులు, వార్డెన్లకు 10వ తరగతి విద్యార్థుల కొరకు తరగతి గదికి ఒకటి చొప్పున 42 అలారమ్ గడియారాలను అందించారు. సాంఘిక సంక్షేమ వసతిగృహాలకు 16, వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహాలకు 8, షెడ్యూల్డ్ తెగల సంక్షేమ వసతి గృహాలకు 15, అల్ప సంఖ్యాక సంక్షేమ వసతిగృహాలకు 3 అలారమ్ గడియారాలను అందించారు. ఈ కార్యక్రమంలో వసతి గృహాల సంక్షేమ అధికారులు రవీందర్రెడ్డి, వినోద్కుమార్, నీరటి రాజేశ్వరి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




ప్రజాపాలన
సంపాదకీయం
బుధవారం 11, జనవరి 2023

# బిహార్ దిశగా భారత్?

బిహార్... మన దేశ చరిత్రలో ఎన్నో ముఖ్య ఘట్టాలకు నెలవు. మనిషి కేంద్రంగా మహాపరివర్తనకు శ్రీకారం చుట్టిన గౌతముడుకి జ్ఞానోదయం కలిగింది అక్కడే. దేశంలో తొలి కేంద్రీకృత రాజ్యవ్యవస్థ ఊపిరిపోసుకుంది ఆ గడ్డ మీదే. దేశానికి తొలి మహానగరాన్ని అందించింది ఆ నేలే. ప్రాచీన కాలంలో పాటలీపుత్రం వెయ్యేళ్లు దేశ రాజకీయాలకు కేంద్రంగా ఉంది. కౌటిల్యుడి రాజనీతికి ఆ ప్రాంతమే ప్రయోగశాల. మనం ఘనంగా చెప్పుకొనే మౌర్య, గుప్త రాజ్యవంశాలు అక్కడ నుంచే అధికారాన్ని చలాయించాయి. కిందటి శతాబ్దంలో దేశ రాజకీయాలు కీలక మలుపుతిప్పిన మండల్ కమిషన్‌కు నేతృత్వం వహించిన బీపీ మండల్ బిహార్‌కు చెందినవారే. 1990ల తర్వాత ఉత్తరాదిన వెనుకబడిన కులాలు రాజకీయాలను శాసించటం మొదలుపెట్టటంలో బిహార్‌దే అగ్రపీఠం. ఇన్ని ప్రత్యేకతలున్న బిహార్ ఇప్పుడు మరో చరిత్రను లిఖించబోతోంది. ఆశించింది అనుకున్నట్లుగా జరిగితే దేశ రాజకీయాలు పెను మార్పులకు లోనుకావటం ఖాయం. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత సర్వసమగ్రంగా కులగణన చేపట్టటం బిహార్‌లో మొదలైంది. రూ.500 కోట్ల ఖర్చుతో ఈ కసరత్తును ఆరంభించారు. అన్ని పార్టీల అంగీకారంతో శాసనసభలో చర్చించి మరీ ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. కులగణనకు సిద్ధాంతరీత్యా బీజేపీ వ్యతిరేకమైనా రాజకీయ లాభనష్టాల లెక్కలకు తలవంచి జై కొట్టింది. హిందూత్వ సిద్ధాంతం రాజకీయ ప్రయోజనాలకు అతీతం కాదన్న విషయం మరోమారు స్పష్టమైంది. 1871లో బ్రిటీషు హయాంలో మొదలైన కులగణన 1931 దాకా ప్రతి పదేళ్లకు ఒకసారి నిరాటంకంగా కొనసాగింది. కేవలం దేశ జనాభాని తెలుసుకోటానికే బ్రిటీషు పాలకులు ఆ కసరత్తుని ఆరంభించలేదు. యూరప్ సమాజంలో లేని ఎన్నో విషయాలు, వ్యవస్థలు భారతదేశంలో బ్రిటీషు వారికి కనిపించాయి. అందులో చాలా ముఖ్యమైంది కులం. యూరప్‌లోనూ వేర్వేరు పద్ధతులు, సంప్రదాయాలు, ప్రత్యేక అస్తిత్వాలు కలిగిన సమూహాలున్నా కులానికి ఉన్న ప్రత్యేక లక్షణాలు బ్రిటీషు పాలకులకు విచిత్రంగా కనిపించాయి. ప్రతి కులానికి వారసత్వంగా వచ్చే ప్రత్యేక వృత్తి, ఇతర కులాలతో వివాహ నిషేధం, కులాల మధ్య చిన్నాపెద్ద తేడా, కొంతమందిని అంటరాని వారిగా చూడటం భారత్‌కే ప్రత్యేకమైన లక్షణాలుగా భావించారు. ఈ లక్షణాలు కలిగిన ప్రతి సమూహాన్ని కులం పేరుతో లెక్కించి వారి జనాభాని తేల్చటం అనూహ్యమైన మార్పులకు కారణమైంది. జనాభా లెక్కల్లో కుల ప్రజల సంఖ్యలు తెలిసిన తర్వాత కుల సంఘాలు పెద్ద ఎత్తున దేశంలో మొదలయ్యాయి. రవాణా సదుపాయాలను, ప్రసార సాధనాలను ఉపయోగించుకుని కుల ప్రజలను సంఘటితపరచటం ఆరంభించాయి. కులాల్లో అంతర్గత సంస్కరణల కోసం ప్రయత్నాలూ ఊపందుకున్నాయి. పేరులో ఒక కులం పట్ల చిన్నచూపు ఉంటే దాన్ని మార్చాలంటూ జనాభా లెక్కల అధికారులకు వినతి పత్రాలను అందచేయటం మొదలుపెట్టారు. అలా కొన్ని వందల కులాలు పేరు మార్పు కోసం ప్రయత్నించాయి. కొన్ని ఉపకులాలు తమని తమ కులాల పేరుతో వేరుగా లెక్కించవద్దని కోరాయి. తమతో సారూప్యతలున్న పెద్ద సంఖ్యాక కులం కిందే నమోదు చేయాలని డిమాండ్ చేశాయి. పెద్దకులాల సరసన స్థానం సంపాదించటానికి ఆ కులాల ఆచారాలను అనుసరించటానికి చాలా ప్రయత్నాలను చేశాయి. కొన్ని కులాలైతే మద్యపానాన్ని, మాంసాహారాన్ని, జంతుబలుల్ని వదులుకున్నాయి. కొన్ని కులాల ప్రజలు బ్రాహ్మణుల మాదిరిగా జంధ్యాన్ని ధరించటం మొదలుపెట్టారు. కులాన్ని సూచించే పేర్లని మార్చుకున్నాయి. మరికొన్ని కులాలు విధవా వివాహాలను నిషేధించాయి. ఒకప్పుడు సులభంగా జరిగే వివాహాల రద్దుని అసాధ్యంగా మార్చాయి. పెద్ద కులాల మాదిరిగా కట్నాలు తీసుకోవటం ప్రారంభించారు. ఇతర కులాలతో విద్యాపరంగా పోటీ పడటానికి కులపెద్దల ప్రోత్సాహాలతో పాఠశాలలు, కాలేజీలు మొదలయ్యాయి. పెద్దకులాల ఆచారాలను ఇలా అనుసరించటాన్ని ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త ఎం.ఎన్.శ్రీనివాస్ సంస్కృతీకరణగా వర్ణించాడు. కులాల లెక్కలు తేలటంతో భిన్న కులాల మధ్య హోదా కోసం, పదవుల కోసం, విద్యా సంస్థల్లో సీట్ల కోసం, ఉద్యోగాల్లో వాటా కోసం పోటీ మొదలైంది. కులాల జనాభా లెక్కల పర్యవసానంగా దీన్ని ఊహించారో లేదో కానీ ఈ పోటీని మాత్రం బ్రిటీషు పాలకులు ఆహ్వానించారు. దేశంలో జాతీయవాదం బలపడటం వారికి ఇష్టంలేదు. సగటు మనిషి చైతన్యం కులాల, మతాల సరిహద్దులను దాటితే జాతీయవాదం వైపు ఆకర్షితం అవుతుంది. పెరిగే జాతీయవాదం వలసపాలనకు ముప్పుతెస్తుంది. అందుకే సమాజంలోని ప్రతి విభజనను రాజకీయ అవసరాల కోసం కొనసాగించటానికే ఇష్టపడ్డారు. కుల సంఘాలకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చారు. బ్రిటీషు పాలకులకు కులాల లెక్కలు, దాంతో పాటు పెరిగిన కొత్త చైతన్యం కలిగించిన ప్రయోజనం ఒకలా ఉంటే, మరోవైపు అవే లెక్కలు సామాజిక న్యాయం కోసం అంబేద్కర్ లాంటి వారికి కొంత ఉపకరించాయి. 1931 నాటి జనాభా లెక్కలను అంబేద్కర్ చాలా చోట్ల తన రచనల్లో ఉదహరించారు. భావాల పరంగా అంబేద్కర్‌ని ప్రధానంగా నడిపించిన వాటిలో ఫ్రెంచ్ విప్లవ నినాదాలైన స్వాతంత్ర్యం, సమభావం, సౌభ్రాతృత్వం ప్రధానమైనవి. సామాజికంగా సమభావం కోసం కొన్నాళ్లైనా రిజర్వేషన్లు ఉండాలని వాదించారు. హిందూ సామాజిక వ్యవస్థ, దానికి ఆధారంగా ఉన్న భావాల మూలంగా కొన్ని వర్గాలను శాశ్వతంగా అధమస్థాయికి పరిమితం చేయటంపైనే అంబేద్కర్ ఆగ్రహమంతా గూడుకట్టుకుంది. సమభావం నెలకొంటే సౌభ్రాతృత్వం ఏర్పడుతుందని అంబేద్కర్ బలంగా నమ్మారు. కులాల హద్దులు దాటిన సౌభ్రాతృత్వం లేకపోతే జాతీయభావం భారత్‌లో పాదుకోలేదని అంబేద్కర్ భావించారు. సంప్రదాయం నిర్దేశించిన అసమాన సామాజిక వ్యవస్థకు కొత్త రాజ్యాంగంలో చోటులేదు కాబట్టి చాలా కాలం పాటు జరిగిన అన్యాయాల్ని సరిదిద్దటానికి కొంతకాలం విద్య, ఉద్యోగాలు, చట్టసభల్లో రిజర్వేషన్లు ఉంటే సరిపోతుందని అంబేద్కర్ విశ్వసించారు. పోటీతత్వం, ప్రతిభపై ఆధారపడే ఆధునిక సమాజం ఏర్పడే దిశగానే రిజర్వేషన్లను అంబేద్కర్ చూశారు. రాజ్యాంగ రచన కూడా ఆ స్ఫూర్తితోనే కొనసాగింది. కుల జనాభాకు సరిసమానంగా రిజర్వేషన్ల కోసం డిమాండ్లు చేస్తున్న వారికి ఈ సమగ్ర దృక్పథం ఉందని చెప్పుకోలేం. ఇప్పటి పోటీ రాజకీయాల స్వల్పకాలిక అవసరాలే చాలా మందిని నడిపిస్తున్నాయి. బిహార్‌లో తేలే కుల లెక్కలతో సంఖ్యాపరంగా బీసీ కేటగిరీలోకి వచ్చే మొత్తం జనాభా విషయంలో పెద్దగా మార్పు ఉండకపోవచ్చు. బీసీ కేటగిరీ పరిధిలోని ప్రతి కులాన్ని విడిగా లెక్కిస్తారు కాబట్టి కొన్ని అనూహ్య ఫలితాలు కనపడొచ్చు. బిహార్‌లోని యాదవుల సంఖ్యలో రెండు మూడు శాతం తేడా వచ్చినా రాజకీయాల్లో కలకలం చెలరేగుతుంది. ఇతర కులాలకీ ఇది వర్తిస్తుంది. సంఖ్యల ఆధారంగా బీసీ కేటగిరీలోనే కొత్త డిమాండ్లు మొదలవుతాయి. 1931 నాటి జనాభా లెక్కల ఆధారంగా ఇప్పటి వరకూ కులాల సంఖ్యను అంచనా వేస్తున్నారు. ఆనాటితో పోల్చితే కులాల జనాభాలో చాలా మార్పులు వచ్చాయి. 1931 నాటికి కుటుంబ నియంత్రణ అన్న భావమే లేదు. ఆర్థికంగా, విద్యాపరంగా ఎదిగిన కులాల్లో జనాభా నియంత్రణ గడిచిన మూడు దశాబ్దాల్లో బాగా పెరిగింది.

# నెంబర్ వన్ నిర్బంధం



జీవోలో పేర్కొన్న కారణాలను చూసినప్పుడు అవి సహేతుకమైనవి కావని మనకు స్పష్టంగా అర్థం అవుతుంది. ఆరవ పేరాలో పేర్కొన్న కారణాలన్నీ ఒక సంఘటనలో చోటుచేసుకున్న ప్రమాదానికి సంబంధించినవి. వాటిని అన్ని సమావేశాలకూ ఆపాదించటంలో ఎటువంటి సహేతుకత లేదు. ఇప్పటిదాకా రహదారులపై కొన్ని వేల సమావేశాలు జరిగి ఉంటాయి. అలాంటి ఒక్క సంఘటనలో జరిగిన ప్రమాదానికి గల కారణాలను అన్ని సందర్భాలలో జరగటానికి అవకాశం ఉందని సూత్రీకరించటం సరైనదికాదు. ఇప్పటికీ ఆ సంఘటన మెజిస్టీరియల్ విచారణలో ఉందని అదే జీవోలో పేర్కొన్నారు. ఇంకా చెప్పాలంటే ఆ కారణాలన్నీ కూడా నివారించదగినవి. కొన్ని ముందు జాగ్రత్తలు తీసుకొని...నిర్వాహకులు, పోలీసులు అప్రమత్తంగా ఉంటే నివారించదగినవి.ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెం.1, ప్రజాస్వామిక హక్కులపై నెంబర్ వన్ నిర్బంధంగా ఉంది. జాతీయ, రాష్ట్ర రహదారులు, వీధులలో ప్రధానంగా సమావేశాలు నిర్వహించుకోవటానికి అనుమతించకపోవడం మంచిదని అధికారులకు సూచిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ జీవోని తీసుకు వచ్చింది. అక్కడ సభలకు అనుమతిస్తే లాజిస్టిక్ చలనంపై వ్యతిరేక ప్రభావం పడుతుందని చెబుతున్నారు. అంటే...పోలీస్ చట్టం-1861, సెక్షన్.3 ఇచ్చిన పర్యవేక్షణ అధికారంతో సెక్షన్ 30 ప్రకారం సమావేశాలను క్రమబద్ధీకరించాల్సిందిగా అధికారులకు ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. అలాగే మున్సిపాలిటీ, పంచాయితీ రహదారులపై కూడా సమావేశాలకు సాధారణ పరిస్థితులలో అనుమతించరాదని, కేవలం ప్రత్యేక పరిస్థితులలో అరుదుగా మాత్రమే అలాంటి రహదారులపై అనుమతించాలని ఆదేశించింది. ఈ రహదారులు ఇరుకుగా, సన్నగా ఉంటాయి. ఈ రహదారులు స్థానికంగా నివాసం ఉండే ప్రజలు స్వేచ్ఛగా తిరగటానికి ఉద్దేశించబడినవి. ఈ రహదారులలో ఎటువంటి అంతరాయం కల్గించినా అది ఆ ప్రాంత ప్రజల ప్రాణాలకు హాని ఏర్పడుతుంది. పౌర జీవనానికి, అత్యవసర సేవలకు ఆటంకం. సాధారణ ప్రజలకు అసౌకర్యం- అంటూ ఈ రహదారులపై నిషేధానికి చెప్పిన ప్రత్యేక కారణాలే కాకుండా సాధారణ కారణాలను కూడా ఇదే జీవోలో చెప్పారు. రహదారులపై సమావేశాలు పెట్టుకోవటం వలన సాధారణ ప్రజలకు భారీ అసౌకర్యం కలుగుతుందని, అలాగే రహదారులపై మీటింగ్ గాయాలకు, మరణాలకు కారణమౌతుందని చెప్పారు. ఈ జీవో 6వ పేరాలో కొన్ని కారణాలను ప్రస్తావించారు. రహదారులు లేక రహదారుల అంచున సమావేశాలు నిర్వహించటం వలన మరణాలు సంభవిస్తాయని, ట్రాఫిక్ అంతరా యం, వాహనాలకు భారీ అంతరాయం కలుగు తుందని అన్నారు. పోలీసులు పరిస్థితిని చక్కదిద్దటానికి ఎక్కువ సమయం తీసుకుంటుందన్నారు. దీనివలన అనారోగ్యంతో వున్నవారు, వృద్ధులు, గర్భిణులు, గాయపడిన వారిని ఆసుపత్రులకు తీసుకెళ్ళి చికిత్స చేయటానికి వీలుపడక ఇబ్బందులకు గురౌతున్నారన్నారు.

**కారణాలు - సహేతుకత**

జీవోలో పేర్కొన్న కారణాలను చూసినప్పుడు అవి సహేతుకమైనవి కావని మనకు స్పష్టంగా అర్థం అవుతుంది. ఆరవ పేరాలో పేర్కొన్న కారణాలన్నీ ఒక సమావేశంలో చోటుచేసుకున్న ప్రమాదానికి సంబంధించినవి. వాటిని అన్ని సమావేశాలకూ ఆపాదించటంలో ఎటువంటి సహేతుకత లేదు. ఇప్పటిదాకా రహదారులపై కొన్ని వేల సమావేశాలు జరిగి ఉంటాయి. అలాంటి ఒక్క సంఘటనలో జరిగిన ప్రమాదానికి గల కారణాలను అన్ని సందర్భాలలో జరగటానికి అవకాశం ఉందని సూత్రీకరించటం సరైనదికాదు. ఇప్పటికీ ఆ సంఘటన మెజిస్టీరియల్ విచారణలో ఉందని అదే జీవోలో పేర్కొన్నారు. ఇంకా చెప్పాలంటే ఆ కారణాలన్నీ కూడా నివారించదగినవి. కొన్ని ముందు జాగ్రత్తలు తీసుకొని...నిర్వాహకులు, పోలీసులు అప్రమత్తంగా ఉంటే నివారించదగినవి. ఆ సంఘటనలో నిర్వాహకుల లోపం ఎంత ఉందన్నది విచారణలో వెలుగు చూడవలసి ఉంది. ట్రాఫిక్ అంతరాయాలు, సాధారణ ప్రజల తాత్కాలిక అసౌకర్యాలు అనేకసార్లు అనేక రూపాలలో జరుగుతున్నాయి. మంత్రులు, ముఖ్యమంత్రుల పర్యటనలు, రాకపోకల సందర్భంగా జరుగుతుంటాయి. అనేక మతపరమైన, ఇతర సందర్భాలలో జరుగుతున్నాయి. అంతరాయాలు, అసౌకర్యాలు లేకుండా పోలీసులు ప్రజలను తాత్కాలికంగా ప్రత్యామ్నా య మార్గాలలో పంపించాలి. పోలీసుల పనే అది. అది కూడా చేయనప్పుడు, చేయలేనప్పుడు సెక్షన్ 30 అమలులో పోలీసులు వైఫల్యం చెందినట్లు. జాతీయ, రాష్ట్ర మున్సి పాలిటీ, పంచాయితీ రహదారుల న్నింటిలోను సమావేశాలు రద్దు చేయడమంటే ఇంక ఎక్కడా నిర్వహించుకోవటం సాధ్యం కాదు. సమావేశాలు, ప్రదర్శనలు లాంటివి ప్రజాసా మ్యానికి ప్రాణం లాంటివి. ప్రాథమికమైనవి. అభిప్రాయాలను పంచుకో వటానికి, ప్రభుత్వాలకు తెలియ చేయటానికి అవి మార్గాలు. వాటిని అడ్డుకోవట మంటే ప్రజాస్వా మిక హక్కులపై ప్రత్యక్ష దాడికి దిగడమే.

**కోర్టులు ఏం చెప్పాయి ?**

ప్రభుత్వం ఊహిస్తున్న ప్రమాదాలు వాస్తవ దూరమైనవి, ఊహాజనితమైనవి కాకూడదని... వాస్తవానికి దగ్గరగాను, ప్రత్యక్ష సంబంధం కలిగి వుండాలని కోర్టులు చెప్పాయి. ఈ విధంగా చూసినప్పుడు ప్రభుత్వం చెప్పిన కారణాలు చెల్లవు.

**నిషేధం అనే పదమే లేదా ?**

ఆ జీవోలో నిషేధం అనే పదం లేదు. సమావేశాలు పెట్టుకోవద్దు అని మేమనలేదు అంటున్నారు. ఏ దరఖాస్తును అనుమతించవద్దు అంటే అది నిషేధం కాదా? అన్ని రహదారులను ప్రస్తావిస్తూ అనుమతి నిరాకరించమని ఆదేశిస్తే అది నిషేధం కాదా? కేవలం అరుదుగా మినహాయించదగిన కేసులలోనే అనుమతి ఇవ్వాలని ఆదేశించటం నిషేధం కాదా? అనుమ తించటానికి కారణాలు తెలియచేయాలని ఆదేశించటమంటే వివరణ ఇచ్చుకోవాల్సిన పరిస్థితిలోకి నెట్టివేయటమే. కాబట్టి ఆచరణలో ఇది నిషేధంగానే మారుతుంది.

**ప్రదర్శనలపై స్పష్టత**

ఒకవేళ ప్రదర్శనలకు అనుమతి ఉంటే వాటిని జీవోలో ఎందుకు ప్రస్తావించలేదు? ఈ జీవో సాకుగా చూపి ప్రజా సంఘాలు చేస్తున్న ప్రదర్శలను ఎందుకు అడ్డుకుంటున్నారు? ఈ జీవోలో కేవలం మీటింగ్‌లు అనే పదం ఉంది. ప్రదర్శనలకు పంబంధించిన ఎలాంటి పరిమితులు చర్చించలేదు. అలాగని వాటికి మినహాయింపు ఇస్తున్నట్లు సష్టంగా ప్రకటించ లేదు. ప్రభుత్వం దానిమీద స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ సలహాదారు ఇచ్చిన స్పష్టత అధికారయుతంగా ఉండాలి.

**ఆచరణ సాధ్యం కాని ప్రత్యామ్నాయాలు**

జీవోలో చెప్పిన ప్రత్యామ్నాయ స్థలాలు, మైదానాలు ఎన్ని ప్రాంతాలు, నగరాలు, పట్టణాలలో గుర్తించబడి ఉన్నాయి? అవి ప్రజలకు అందుబాటులో లేకుండా, సభ నిర్వహణ అసాధ్యమనే పరిస్థితి ఉంటే అది నిషేధం కాదా? ఇప్పటివరకు అధికారికంగా చాలా కొద్దిపాటి నగరాలు, పట్టణాలలోనే అలాంటి స్థలాలు ఉన్నాయి. మిగిలిన ప్రాంతాలలో సమావేశాలు నిర్వహించకూడదా? ప్రజా సమావేశాలకు ప్రైవేటు స్థలాలు ఎవరైనా ఇస్తారా? పబ్లిక్ మీటింగ్‌లను ప్రైవేటు స్థలాల్లో పెట్టుకోవలసిన దుస్థితి ప్రజాస్వామ్యంలో ఉంటుందా?

**సెక్షన్ 29పై స్పందన ఏది?**

రెండు సంఘటనలు జరిగాయని పోలీస్ చట్టం-1861 సెక్షన్ 30ను రాష్ట్రమంతటా ప్రయోగించిన ప్రభుత్వాలు... పోలీసులు తమ కస్టడీలో ఉన్న వారిపై హింసను ప్రయోగించకూడదనే సెక్షన్ ఉల్లంఘనలకు సంబంధించి మాత్రం స్పందించలేదు. ఈ సెక్షన్ 29 ప్రకారం కస్టడీలో వ్యక్తులపై హింస నేరం. ఇంత వరకు పోలీసులు తమ కస్టడీలోని వ్యక్తులపై హింస ప్రయోగించలేదా?

**ప్రతిపక్షాలు- ప్రజాసంఘాలతో చర్చలు**

ప్రజాస్వామ్య దేశంలో ప్రభుత్వ నిర్ణయాల్లో ప్రజల భాగస్వామ్యం ఉండాలి. ముఖ్యంగా ఇలాంటి నిర్ణయాలు తీసుకొనేటప్పుడు రాష్ట్రంలో ఉన్న ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలతో సంప్రదింపులు జరపాలి. సమావేశం ఏర్పాటు చేయాలి.

**సెక్షన్ 30 దుర్వినియోగం**

ఈ సెక్షన్ నిరంతరం దుర్వినియోగం అవుతూంటుంది. సెక్షన్ 144 సి.ఆర్.పి.సి ప్రకారం పౌరహక్కులపై పరిమిత కాలం పాటు షరతులు విధించి నియంత్రించటానికి కార్యనిర్వాహక వర్గానికి అధికారం ఉంది. కాని ఆ పేరుతో అన్ని ప్రధాన నగరాలు, పట్టణాలలో చట్టంలో పేర్కొన్న కాల పరిమితి కంటే ఎక్కువ సమయం నియంత్రిస్తున్నారు. ఆచరణలో రాజ్యాంగం ఇచ్చిన పౌరహక్కులను నిషేధిస్తున్నారు. ఈనెల 6న విజయవాడ కమిషనర్ ఇచ్చిన ('సాక్షి') ప్రకటన ప్రకారం జనవరి 6వ తారీకు నుంచి మార్చి 31వ వరకు సెక్షన్ 30 అమలులో ఉంటుంది. అంటే ఒకేసారి 85 రోజులు ఈ చట్టాన్ని విధించారు. అంతటి ప్రత్యేక పరిస్థితులు (ప్రమాదాలు) ఏం ఉన్నాయో ప్రభుత్వమే చెప్పాలి. అన్ని నగరాలు, పట్టణాలలో ఈ చట్టాన్ని నిరంతరం ప్రయోగిస్తూనే ఉన్నారు.

**1861 చట్టమా? 1859 చట్టమా ?**

అసలు పోలీస్ చట్టం-1861 ఆంధ్ర ప్రదేశ్‌కి వర్తిస్తుందా అనేది సందేహం. ఎందు కంటే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకించి 1859లో ఆమోదించబడిన ఆంధ్రప్రదేశ్ (ఆంధ్ర ఏరియా) డిస్ట్రిక్ట్ యాక్ట్- 1859, యాక్ట్ నెం. 24 (రోమన్ అంకెలు) ఆఫ్ 1859 ఉన్నది. ఈ చట్టంలోని సెక్షన్ 4 ప్రకారం ప్రభుత్వాలకు పోలీసులపై పర్యవేక్షణ అధికారాలు ఉన్నాయి. ఈ చట్టం ఉండగా 1861 చట్టం సెక్షన్ 3లో ఉన్న అధికారాలను ఉపయోగిస్తూ ప్రభుత్వం జీవో నెం.1 తీసుకు వచ్చింది. రాష్ట్రానికి ప్రత్యేక చట్టం ఉండగా వేరే చట్టాన్ని ఉపయోగించి జీవో తీసుకురావటమనేది చట్టపరంగా నిర్ధారణ కావాల్సి వుంది.


**1861వ చట్టం మార్పు అవసరం**

ప్రజాస్వామ్య పోలీసింగ్ వ్యవస్థ ఏర్పాటుకు ఈ చట్టం ఏ విధంగాను సహాయపడదు. ప్రభుత్వానికి పోలీసులపై ఎటువంటి మార్గదర్శకాలు, నియంత్రణలు లేని పర్యవేక్షణ అధికారాన్ని ఈ చట్టం ఇచ్చింది. ఫలితంగా పోలీసు వ్యవస్థలో రాజకీయ ప్రభావం విపరీతంగా పెరిగి...చట్టబద్ధంగా నడుచుకోవాల్సిన పోలీసులు...రాజకీయ నాయకుల చట్ట వ్యతిరేక సిఫార్సులకు తలొగ్గి పనిచేస్తున్నారు. పోలీసు జవాబుదారీతనానికి సరైన యంత్రాంగాన్ని ఈ చట్టం కల్పించలేదు. 1857లో జరిగిన సిపాయి తిరుగుబాటు తరువాత వచ్చిన ఈ చట్టం బ్రిటీషు అవసరాలకు అనుగుణంగా ఉన్నది. నేషనల్ పోలీసు కమిషన్ 1981లో ఇచ్చిన 8వ నివేదికలో ...ఒక నమూనా పోలీసు చట్టాన్ని తయారు చేసి అందించింది. అంటే 1861వ చట్టం స్థానంలో అలాంటి చట్టం వుండాలని సూచించింది.

**ఉపసంహరించాల్సిందే !**

ఏదో ఒక కారణంతో ప్రశ్నించే వారి గొంతు నొక్కి పౌరహక్కులపై నిర్బంధం తీసుకురావటం సరైన చర్య కాదు. సభలు, సమావేశాలపై సహేతుక షరతులు విధించి ప్రజా భద్రతను, సౌకర్యాలను కాపాడవచ్చు. కనుక ప్రభుత్వం వెంటనే ఈ జీవోను ఉపసంహరించాలి.

# అలంకారం



శిఖర సౌందర్యం ప్రశంసనీయమే
అదే క్రమంలో లోయ సొగసు గొప్పదే
దేనికీ ఎప్పుడూ కంపించని
మనో ధారుఢ్యంతో పాటు
చలనసహితమైన జీవితాన్ని వదలకూడని
తెలియట్లా ?

అహంకారం , అనుమానం ప్రమాదమని
ఇప్పటికైనా తెలియక పోతే ఎట్లా?
మనిషి అవసరం కోసమే ఏదైనా
స్వీకరించడం,
ఇది చాలనుకోవడం సులకనేం కాదు
అది తక్కువతనం అంతకన్నా కాదు

కడలి కెరటం దూకుడు ఒకరైతే
నదీలో అల నడక మరొకరిది
ఎప్పుడూ దేనికీ ఇది లేదని, అది
లభించలేదని
దు:ఖించరాదని తెలుసుకోకపోతే ఎట్లా?
ఉన్నది చాలు
ఇక్కడుంటే చాలు
కీర్తి కిరీట ధారి ఒకరైతే
తలగుడ్డ వారసత్వం ఇంకొకరిది
ఇక్కడ ఒక మంచి మనిషిగా బతగ్గలగడమే
ఏ మనిషికైనా అందం, అలంకారం !

**- రవి నన్నపనేని**

## ఘనంగా బి.అర్.ఎస్ యూత్ నాయకుడి జన్మదిన వేడుకలు



కోరుట్ల, జనవరి 10 (ప్రజాపాలన ప్రతినిధి):కోరుట్ల పట్టణం లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కోరుట్ల మండల యూత్ నాయకుల ఆద్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షులు నత్తి రాజ్ కుమార్ జన్మదినం సందర్భంగా కేకు కట్ చేసి, వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తోట నారాయణ, యూత్ నాయకులు సనవుద్దిన్, కుంటల వికాస్, పుప్పల నాగరాజు, చిత్తరి ఆనంద్, సృజన్, బియ్యరి కిరణ్, తోగారి మనోహర్ , వినయ్ ,జిల్లా రాజు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం కేసీఆర్ జిల్లా పర్యటన ఏర్పాట్లు పూర్తి చేయాలి... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ శ్రీ రేగా కాంతారావు.. మరియు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి...



బూర్గంపాడు (ప్రజా పాలన.)ఈనెల 12వ తేదీ నాడు భద్రాద్రి జిల్లాకు సీఎం కేసీఆర్ నూతన కలెక్టరేట్ భవనాన్ని పరిశీలించి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఈరోజు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రాల్లోని నూతన కలెక్టరేట్ భవనాన్ని పరిశీలించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ %డ% పినపాక శాసనసభ్యులు %డ% భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీ రేగా కాంతారావు మంగళవారం నాడు జిల్లాలోని పలు శాఖల, అధికారులతో కలిసి ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు., ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పర్యటన ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని అధికారులను కోరారు. ఈనెల 12వ తేదీనాడు సీఎం కేసీఆర్ చేతుల మీదుగా కలెక్టరేట్ భవనం ప్రారంభోత్సవం కానున్నది, సీఎం కేసీఆర్ నాయకత్వంలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుంది అన్నారు.తెలంగాణ రాష్ట్రంలో సమీకృత కలెక్టరేట్లు ఉన్నట్లు దేశంలో ఏ రాష్ట్రంలో లేవన్నారు, సుమారు 32 శాఖల అధికారులు ఒకే కార్యాలయంలో పరిపాలన ప్రారంభించు నందున ప్రజలకు సేవలు సులభతరం కానున్నాయన్నారు అన్ని సమస్యలకు పరిష్కారాలకు కలెక్టర్ కార్యాలయం వేదికగా మారదుందన్నారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఎమ్మెల్యే శ్రీ వనమా వెంకటేశ్వర్లు , జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీ దిండి గల రాజేందర్ , జిల్లా కలెక్టర్ శ్రీ దురిశెట్టి అనుదీప్ జిల్లా ఎస్పీ శ్రీ డాక్టర్ వినీత్ , జిల్లా అదనపు కలెక్టర్ కర్నాటి వెంకటేశ్వర్ల పలు శాఖల జిల్లా ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రెండవ సతీష్ రెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ని ప్రారంభించిన బూర్గంపహాడ్ జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత, మాజీ పిఏసిఎస్ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి....



బూర్గంపాడు (ప్రజా పాలన.) బూర్గంపహాడ్ మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో మిత్రుని జ్ఞాపకార్ధంగా లక్ష్మీపురం ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నటువంటి రెండవ సతీష్ రెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా పాల్గొని టోర్నమెంట్ ని ప్రారంభించిన బూర్గంపహాడ్ జడ్పీటీసీ శ్రీమతి కామిరెడ్డి శ్రీలత .అనంతరం జడ్పీటీసీ శ్రీలత మాట్లాడుతూ మిత్రుని జ్ఞాపకార్ధంగా లక్ష్మీపురం ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఈ టోర్నమెంట్ నిర్వహించడం చాలా గొప్ప విషయమని వారి మిత్రులను కొనియాడారు.తమ చిన్ననాటి స్నేహితున్ని మర్చిపోకుండా కలకాలం గుర్తుంచుకునేందుకు అతని పేరుతో ప్రతియేటా ఈ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం చాల సంతోషకరమైన విషయమని వారి మిత్ర బంధాన్ని అభినందించారు.అలాగే క్రిడలు అనేవి యువతలో దాగివున్న నైపుణ్యాన్ని వెలికితీసి వారి ప్రతిభను ప్రపంచ నలుమూలలు చాటిచెప్పడానికి దోహదపడతాయని తెలిపారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ గ్రామ కమిటి అధ్యక్షులు పోతిరెడ్డి గోవింద రెడ్డి ,స్థానిక వార్డుసభ్యులు పాలం దివాకర్ రెడ్డి ,చింతా వెంకట్రామిరెడ్డి,స్థానికులు ఆవుల నాగార్జున రెడ్డి ,కటుకూరి వెంకన్న,ఆర్గనైజింగ్ సభ్యులు బాదం గణేష్ రెడ్డి ,యారం పున్నారెడ్డి చగర్లమూడి.జగదీష్ దుగ్గ శ్రీనివాస రెడ్డి ,దుగ్గ రాజశేఖర్ రెడ్డి ,పడిదెల శ్రీను బందెల శ్రీను ,పాలం ప్రకాష్ రెడ్డి పేరం సంజీవ రెడ్డి ,బొడ్డు రామాంజి రెడ్డి ,ఆవుల పవన్ కుమార్ రెడ్డి ,బిజ్జం అంజిరెడ్డి ,ఉమ్మలరెడ్డి బాలశేఖర్ రెడ్డి ,యారం పూర్ణ చందర్ రెడ్డి ,యల్లాంకి నాగేశ్వర్ రావు ,ఆలేటి వెంకటేష్(గిరి)గారు,జక్క.కార్తిక్ ,కన్నెకంటి యాకుబ్ రెడ్డి , క్రిడాకారులు మరియు తదితరులు పాల్గొన్నారు..

# వరద బాధితుల హామీ నెరవేర్చమని నిరసన దీక్ష చేస్తున్న గోదావరి వరద ముంపు బాధితులపై అటవీ సిబ్బంది దౌర్జన్యం.....



బూర్గంపాడు (ప్రజా పాలన.): ఈరోజు జనవరి 10న ఉదయం 9 గంటల నుండి గోదావరి వరద ముంపు బాధితులపై ఫారెస్ట్ సిబ్బంది దౌర్జన్యానికి పాల్పడ్డారు. 150 రోజులుగా 300 మంది వరద బాధితులు శాంతియుతంగా నిరవధిక నిరసన దీక్షను చేపడుతున్నారు. అటవీ సిబ్బందికి నిరసనకారులకు మధ్య ఎలాంటి వివాదం లేదు. రోడ్డు ప్రక్కన ఆర్ అండ్ బి ప్రభుత్వ స్థలములో 300 మంది ఆదివాసీలు గుడారాలు ఏర్పాటు చేసుకొని నిరవధిక నిరసన దీక్ష చేపట్టారు. ఈ దీక్ష శిబిరాన్ని అటవీ సిబ్బంది ధ్వంసం చేశారు. నివాస స్థలం చూపించమని తహసిల్దార్, కలెక్టర్ తో సంప్రదింపులు జరుపుతున్నాం. గోదావరి ముంపు బాధితులతో పాటు నిరుపేద ఆదివాసి, దళితులకు కూడా గృహ వసతి కల్పించమని కోరుతున్నాము. పినపాక భద్రాచలం నియోజకవర్గం పరిధిలో దాదాపు 25వేల కుటుంబాలు గృహాలు లేక ఇబ్బంది పడుతున్నారు. సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మద్దతుతో నిరుపేదలు పోరాట కమిటీని ఏర్పాటు చేసుకొని శాంతియుతంగా పోరాడుతున్నారు. ఇది ముఖ్యమంత్రి హామీని నెరవేర్చమని చేస్తున్న పోరాటం. ఆదివాసీలపై అటవీ సిబ్బంది దౌర్జన్యానికి పాల్పడటం పూర్తిగా చట్ట వ్యతిరేకం. వీరు తగిన మూల్యం చెల్లించుకోవలని వస్తుందని హెచ్చరిస్తున్నాం. అటవీ సిబ్బంది దాడిలో వాసం భద్రమ్మ, కురసం భద్రమ్మ అనే ఆదివాసీ మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. అటవీ మహిళా సిబ్బంది వీరిపై పిడిగుద్దులు గుద్దుతూ, బూట్లతో కిందపడేసి తొక్కారు. ఈ పెనుగులాటలో అనేకమంది ఆదివాసీ మహిళలను గాయపరచడం వలన సొమ్మసిల్లి పడిపోయారు. 2022 జులై 17న భద్రాచలంలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని నెరవేర్చుటకు స్థానిక పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు తగిన కృషి చేయాలని కోరుతున్నాం. ఈ ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన 1700 కోట్ల తో గృహ వసతి కల్పించాలని డిమాండ్ చేస్తున్నాం. అటవీ సిబ్బందిని అదుపులో పెట్టాలని కోరుతున్నాం. లేనియెడల జరగబోయే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకురాలు పెద్దగోని ఆదిలక్ష్మి, గోదావరి వరద ముంపు బాధితుల పోరాట కమిటీ అధ్యక్షుడు ఎట్టి లక్ష్మణ్, నిరుపేదల గృహకల్ప సాధన కమిటీ నాయకులు కొండపనేని కృష్ణయ్య, ముత్యాల సత్యనారాయణ, పోరాట కమిటీ నాయకులు కొమరం సుజాత, కొమరం భద్రమ్మ, సున్నం భూలక్ష్మి, గజ్జల అలివేలు, పర్సిక రమణ చిడుం ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఒత్తిడి లేని విద్యను అభ్యసించాలి

### కేంద్ర సహాయక మంత్రి బి.ఎల్ వర్మ



బోనకల్, జనవరి 9 ప్రజాపాలన ప్రతినిధి: పార్లమెంట్ ప్రవాస్ యోజనలో భాగంగా కేంద్ర సహాయ మంత్రి బి ఎల్ వర్మ, జిల్లా అధ్యక్షులు గల్లా సత్యనారాయణ తో కలసి జిల్లాలో పలు మండలాల్లో పర్యటించారు. పర్యటనలో భాగంగా మంగళవారం మండలంలోని బోనకల్ స్టేషన్ రావినూతల మహాత్మ జ్యోతిబాపూలే (ఎంజెబీసీ) గురుకుల పాఠశాలలో విద్యార్థులు గౌరవ వందనంతో, ఉపాధ్యాయులు పుష్పగుచ్చాలతో మంత్రికి స్వాగతం పలికారు. ఈ పాఠశాల ను సందర్శించడం ఎంతో సంతోషంగా ఉందని, విద్యార్థులు ఒత్తిడి లేని విద్యను అభ్యసించాలని, పరీక్షలను పండగలాగా ఆనందిస్తూ ఎదుర్కోవాలని మంత్రి తెలిపారు. నరేంద్ర మోడీ సర్కార్ చాయ్ పే చర్చ లాగా పరీక్ష పే చర్చ కార్యక్రమాలు చేపడుతూ విద్యావిధానాలలో గణనీయమైన మార్పులు తీసుకొస్తున్నారని వెల్లడించారు. ముందుగా బోనకల్, మధిర బిజెపి నాయకులు మంత్రికి ఘన స్వాగతం పలికి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు వీరపనేని అప్పారావు, బిజెపి ఎస్టీ మోర్చా రాష్ట్ర ఐటీ సెల్ కన్వీనర్ బీపీ నాయక్, బిజెపి నాయకులు జంపాల రవి, తాళ్లూరి సురేష్, కారంగుల మురళీకృష్ణ, సుమన్ బాబు, మరీదు పరశురాముడు, బిజెపి సీనియర్ నాయకులు మందపల్లి పాపారావు, గంగుల నాగేశ్వరరావు, ఇతర మండల నాయకులు,మధిర నియోజకవర్గ నాయకులు జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పిల్లి అక్షయ ఐశ్వర్య జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించిన మాలమహానాడు అధ్యక్షురాలు బోడా దివ్య



బూర్గంపాడు (ప్రజాపాలన.):భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం గురుకుల హాస్టల్ జాతీయ మాల మహానాడు బూర్గంపాడు మండల అధ్యక్షులు , పినపాక నియోజకవర్గం ఇంచార్జ్ పిల్లి రవి వర్మ కుమార్తెలు పిల్లి అక్షయ ఐశ్వర్య పుట్టినరోజు సందర్భంగా పాలవంచ గురుకుల బాలికల హాస్టల్లో 40 మందికి స్వీట్స్ బాక్సులు అందజేసిన బోడ దివ్య.. అక్షయ ఐశ్వర్య పుట్టినరోజు వేడుక లో ముఖ్య అతిథిగా జాతీయ మాల మహానాడు జిల్లా నాయకురాలు బోడ దివ్య పిల్లి అక్షయ ఐశ్వర్య కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈకార్యక్రమంలో గురుకుల విద్యార్థులు , పూజిత , ప్రేమ శ్రీ, శ్రీవల్లి, శ్రీజ, సౌమ్య, సౌజన్య, విక్టోరియా, తదితరులు పాల్గొన్నారు.

## అబాకస్ పద్ధతి ద్వారా గణిత బోధన

### యజ్ఞ ఫౌండేషన్ కరస్పాండెంట్ ఉజ్వల్ రాజ్



వికారాబాద్ బ్యూరో 10 జనవరి ప్రజా పాలన : గణితం అంటే భయం పోగొట్టేందుకు ఆసక్తిని పెంపొందించేందుకు అబాకస్ గణిత పద్ధతి చాలా సులువైందని యజ్ఞ ఫౌండేషన్ కరస్పాండెంట్ ఉజ్వల్ రాజ్ అన్నారు. మంగళవారం వికారాబాద్ మునిసిపల్ పరిధిలోని దన్నారం సమీపంలోని స్వామి వివేకానంద గురుకుల్ హ్యూమన్ ఎక్సలెన్స్ స్కూల్ ఆధ్వర్యంలో నేషనల్ యూత్ డే సెలబ్రేషన్స్ ఐదవ రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తేలిక పద్ధతిలో గణితం సమస్యలు సాధించుట, పెన్ను పేపర్ లేకుండానే లెక్కలు చేయడం వలన మెదడు చురుకుదనము, ఏకాగ్రత పెరుగుతుందని స్పష్టం చేశారు. స్వామి వివేకానంద గురుకుల్ స్కూల్ ధన్నారంలో అబాకస్ పద్ధతి ద్వారా గణిత అభ్యాసము గత ఐదు సంవత్సరాల నుండి బోధిస్తున్నామని వివరించారు. వికారాబాద్ పట్టణంలోని ఎస్ఎల్ బి కొత్తగడి, చించల్పేట్, భాష్యం, టీఎస్ డబ్ల్యూ ఆర్ ఐ పాఠశాలలో స్వామి వివేకానంద గురుకుల్ విద్యార్థులు ఉపాధ్యాయులు వెళ్లి అబాకస్ ద్వారా గణితం అభ్యాసం చేయించారని తెలిపారు. అబాకస్ మోటివేషన్ తో పాటు గురుకుల్ విద్యార్థులు టైక్వాండో శిక్షణ కార్యక్రమాలను కూడా ఎస్, ఎల్ ,బి నాగార్జున స్కూల్ లో నిర్వహించామని వెల్లడించారు. టైక్వాండో నేర్చుకున్నటువంటి విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం శారీరక దారుఢ్యం పెరుగుతుందని స్పష్టం చేశారు. టైక్వాండోను బాలికలు తమ ఆత్మ రక్షణకై శిక్షణ తీసుకోవాలని సూచించారు.

## ఘనంగా కాంగ్రెస్ పార్టీ బూర్గంపాడు మండల ప్రధాన కార్యదర్శి చల్ల వెంకట నారాయణ జన్మదిన వేడుకలు.




బూర్గంపాడు (ప్రజా పాలన.): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, పినపాక నియోజకవర్గం నాయకులు చల్లా వెంకటనారాయణ జన్మదినం సందర్భంగా డీసీసీ అధ్యక్షులు, భద్రాచలం ఎమ్మెల్యే శ్రీ పొదెం వీరయ్య క్యాంపు కార్యాలయము నందు కేకు కట్ చేపించి శుభాకాంక్షలు తెలియజేసిన భద్రాచలం నియోజకవర్గం శాసనసభ్యులు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పొదెం వీరయ్య . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలోపినపాక నియోజకవర్గ కోఆర్డినేటర్ కాటబోయిన నాగేశ్వరరావు, నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ బీరం సుధాకర్ రెడ్డి, మాజీ గ్రంథాలయ చైర్మన్ బోగల శ్రీనివాస రెడ్డి,జిల్లా మైనారిటీ చైర్మన్ మహిమూద్ ఖాన్, భద్రాచలం పట్టణ అధ్యక్షుడు సరేళ్ల నరేష్, చల్లా ఆర్మీ సిబ్బంది కొలురి శ్రీకాంత్,దారా మణికంఠ, కొలురి నాగేంద్ర బాబు, కోతమర్తి శివ, నాగశేషు, నంద్రు వరుణ్, నవీన్, మోదుగు గౌతమ్, కిరణ్ కుమార్,బోగపతి సచిన్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ నియామక అవకతవకల పై కాంగ్రెస్ పార్టీ నిరసన



మంచిర్యాల టౌన్, జనవరి 10, ప్రజాపాలన: పోలీస్ ఉద్యోగుల నియామకం లో జరిగిన అవకతవకలను నిరసిస్తూ యువజన కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఐబీ చౌరస్తా లో నిరసన దీక్షను చేపట్టారు. ఈ దీక్షా శిబిరాన్ని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ,యువజన కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి సందర్శించి, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం దేశంలో ఏ రాష్ట్రంలో లేని నిబంధనలను అమలులోకి తీసుకువచ్చి నిరుద్యోగ యువకులకు ఉద్యోగాలు రాకుండా కుట్ర పన్నిందని ఆరోపించారు. ప్రభుత్వం తన తప్పిదాన్ని గుర్తించి ఉద్యోగాల నియామక పోటీల్లో పాల్గొన్న అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో యువజన కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం తీవ్రం చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు సళ్ళ మహేష్, పట్టణ అధ్యక్షులు షేర్ పవన్, నరిగే నరేష్, అంకతి శ్రీనివాస్, అధికార ప్రతినిధి నాయికిని సురేందర్, పిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్ల సత్యనారాయణ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తూముల నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## బాయిజమ్మ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం



బెల్లంపల్లి జనవరి 10 ప్రజా పాలన ప్రతినిధి: మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో మంగళవారం మధ్యాహ్నం గర్భిణులు, బాలింతలకు, రోగులకు, బాయిజమ్మ సాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేసినట్లు ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ కాంపల్లి శంకర్, రాజేశ్వరి తెలిపారు. బుధవారం దాతలు పుల్ల మంజుల, సంపత్, యం.డి సజ్జూభేగం. సీహెచ్ రామదాసుల సహకారం తో, ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. ప్రతి మంగళవారం బెల్లంపల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో గర్భిణులకు,బాలింతలకు రోగులకు, సాయి భోజన్ అన్నదానం చేస్తున్నామని, ఈ సందర్భంగా ఆస్పత్రిలోని, గర్భిణీలు, బాలింతలు, రోగులు అన్నదాన కార్యక్రమాన్ని వినియోగించుకునీ అన్నదానం చేయడం పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ, బాయిజమ్మ సాయి సేవా ట్రస్ట్ కి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రస్టు మేనేజర్ బోద్దున సతీష్, జక్కం నాగమణి, కొంక శ్రీనివాస్, ఇగురపు భాస్కర్, ఏనుగు హేమలత, విజ్జి గిరి శంకర్, చుంచుల వెంకటేష్, జక్కం శివరాం, తాటిపాముల మనీష్, డాక్టర్లు, ఆస్పత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు: ఎంపీపీ కృపేష్



ఇబ్రహీంపట్నం జనవరి తేదీ 10 ప్రజాపాలన ప్రతినిధి :పీఎంశ్రీ పథకం కింద ఉప్పరగూడ గ్రామం పాఠశాల ఎంపిక కావడం జరిగింది ఈ పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన పాఠశాలలో మౌలిక వసతులతో పాటు కంప్యూటర్స్ డిజిటలైజేషన్ సైన్స్ మెటీరియల్ తో పాటు అన్ని సౌకర్యాలు కల్పించడంతోపాటు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఒక కార్పొరేట్ పాఠశాలల లో ఉన్నటువంటి అన్ని సౌకర్యాలు కల్పించే విధంగా ఈ పథకం రూపొందించబడిందని ఇబ్రహీంపట్నం ఎంపీపీ పి కృపేష్ పేర్కొన్నారు ఈ యొక్క పథకం స్థానిక ఎమ్మెల్యే శ్రీ మంచిరెడ్డి కిషన్ రెడ్డి మంత్రివర్యులు సబితా ఇంద్రా రెడ్డి సహకారంతో ఈ గ్రామాన్ని ఎంపిక చేసినందుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది ఇందులో పాల్గొన్నవారు ఎంపీడీవో జయరాంవిజయ్, ఎంఈఓ వెంకట్ రెడ్డి, సర్పంచ్ సంఘం అధ్యక్షుడు బూడిద రామిరెడ్డి ,

## ప్రజా సమస్యల పరిష్కారం కోసం అధికారులు సహకరించాలి: ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య.




బెల్లంపల్లి జనవరి 10 ప్రజా పాలన ప్రతినిధి: తాండూరు మండలంలో ని వివిధ గ్రామాల్లో ప్రజల సమస్యలను పరిష్కరించడానికి, ప్రజా ప్రతినిధులతో పాటు, అధికారులు కూడా సమన్వయంతో పనిచేయాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. బుధవారం నియోజకవర్గంలోని తాండూరు మండల ప్రజా పరిషత్ సమావేశం ఎంపీపీ ప్రణయ్ అధ్యక్షతన ఏర్పాటు చేయగా, ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు, రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని, త్రాగు నీరు, రోడ్లు, తదితర అత్యవసరమైన పనులు అధికారులు చేపట్టి, త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక జడ్పీటీసీ సాలిగామ బాణయ్య , మండల ఎంపీటీసీలు, సర్పంచ్ లు, ప్రజాప్రతినిధులు, తాసిల్దార్ కవిత , ఎంపిడిఓ , సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 22న నేతకాని మహా ఆత్మీయ సమ్మేళనం



జన్నారం, జనవరి 10, ప్రజాపాలన: ఈనెల 22న నేతకాని మహా ఆత్మీయ సమ్మేళనం జరుగుతుందని మంగళవారం నేతకాని కుల హక్కుల సంఘం రాష్ట్ర నాయకులు బోర్లకుంట ప్రభుదాస్ అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల కేంద్రంలోని విలేకరులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ నేతకాని కులస్తుల హక్కుల కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రాలను విడుదల చేశారు. నేతకాని కులస్తులు ఒకటిగా ఉండి పోరాడితేనే హక్కులు సాధించుకోవడానికి ఉద్యమించాలన్నారు. పెద్దపెల్లి జిల్లా రామగుండం లక్ష్మీ నరసింహ గార్డెన్ ఎన్టిపిసి లో జరిగే సభకు నేతకానిలు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు. మంచిర్యాల జిల్లా 18 మండలాలలో నేతకాని కులస్తులు ఉన్నారని వారికి ఎలాంటి గుర్తింపు లేకుండా బతుకుతున్నామన్నారు. నేతకాని కులస్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తాళ్లపల్లి రాజేశ్వర్ కాకురా ప్రేమ్సాగర్, కే వెంకటస్వామి, రత్న లక్ష్మణ్, జాడి వెంకట్, రత్నం మాణిక్యం, బండారి సాగర్, జునుగురు లక్ష్మణ్, జాడి గంగాధర్, జాడిశంకర్, జాడి సుధాకర్ బి రాజు వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

## కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయండి: ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



బెల్లంపల్లి జనవరి 10 ప్రజా పాలన ప్రతినిధి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ జక్కుల శ్వేత అధ్యక్షతన అధికారులతో, ప్రజా ప్రతినిధులతో, ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. రెండవవిడత కంటి వెలుగు కార్యక్రమం ఈనెల 18వ తేదీ నుంచి ప్రారంభం అవుతున్నందున, రోజూవారీ షెడ్యూల్ ప్రకారం, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బి, సుదర్శన్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, బి ఆర్ ఎస్ నాయకులు, ఆర్డిఓ శ్యామలదేవి, మున్సిపల్ కమిషనర్ వెంకటేష్ , సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్పల ఇరుముడి మహొత్సవం



బోనకల్, జనవరి 10 ప్రజా పాలన ప్రతినిధి: మండల పరిధిలోని చోప్పకట్లపాలెం గ్రామంలో అయ్యప్ప స్వాములు 41 రోజులు దీక్ష పూర్తిచేసుకుని మంగళవారం ఇరుముడి ధరించి శబరిమలైకు వెళ్లారు. అయ్యప్పల ఇరుముడి మహొత్సవం గుర్రం నరేష్ గురు స్వామి ఆధ్వర్యంలో అయ్యప్పను భక్తితో కొలుస్తూ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఇరుముడి కార్యక్రమం సందర్భంగా మలినాథ మహానాగ శివాలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కుర్ర పాపారావు గురుస్వామి, అయ్యప్పలు నంబూరి నరసింహారావు, బోయినపల్లి ముఖేష్, పర్సగాని గోపి, ఎర్రం శెట్టి రవి, గరపాకుల గోపి, బాలు, గ్రామ సర్పంచ్ ఎర్రంశెట్టి సుబ్బారావు, ఉప సర్పంచ్ బోయినపల్లి వెంకటేశ్వర్లు, గ్రామస్తులు బోయిన శేఖర్ బాబు, పోలెబోయిన శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కేశవరావుకు నాట్యమండలి కళాకారులు నివాళులు..



తల్లాడ, జనవరి 10 (ప్రజా పాలన న్యూస్): ప్రముఖ పౌరాణిక, చారిత్రాత్మక, సాంఘిక నటుడు చీకటి కేశవరావు ఇటీవల మృతి చెందారు. మంగళవారం ఆయన దశదిన కార్యక్రమానికి పౌరాణిక నాట్యమండలి సభ్యులు హాజరై నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి వారు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. నివాళులర్పించిన వారిలో పౌరాణిక నటులు ఉల్లి పార్థసారథి, నున్నా సాందీపులు, గుమ్మ వలరాజు, మల్లిడి శేషయ్య, రాయపాటి వెంకటయ్య, ఉల్లి సత్యనారాయణ, ఆపతి రాములు సంతాప సానుభూతిని వ్యక్తం చేశారు. కేశవరావు మృతి పౌరాణిక నాటకానికి తీరని లోటు అన్నారు.

## శ్రీరాములోరిని దర్శించుకున్న శ్రీనివాసరెడ్డి దంపతులు..



తల్లాడ, జనవరి 10 (ప్రజా పాలన న్యూస్): రాష్ట్రంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రంగా పేరుగాంచిన భద్రాచలంలో ఉన్న శ్రీరామచంద్రస్వామిని తల్లాడ బీఆర్ఎస్ పార్టీ జోనల్ చైర్మన్, విడిసీ చైర్మన్ దగ్గుల శ్రీనివాస రెడ్డి, లలిత కుమారి దంపతులు మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీరాములోరికి వారు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలను స్వీకరించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రానున్న రోజుల్లో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో పాడిపంటలతో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వారి వెంట సీతారెడ్డి, విజయ, అభినవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రూ.7 లక్షలతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన కార్పొరేటర్ బండారు



మేడిపల్లి, జనవరి 10 (ప్రజాపాలన ప్రతినిధి) :రామంతాపూర్ డివిజన్ అభివృద్ధిలో భాగంగా పాతరామంతాపూర్ బొడ్రాయి దగ్గర స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకటరావు రూ 7 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్లోని సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రామంతాపూర్ డివిజన్ బిజెపి అధ్యక్షులు బండారు వెంకట్రావు, బుర్ర రాజేశ్వర్, మామిండ్ల సుధాకర్ యాదవ్, పడిగం నగేష్, ముస్తాక్, కపిల్ గౌడ్, వేముల తిరుపతయ్య, మరియు స్థానికులు పాల్గొన్నారు.

## హాత్ సే హాత్ జోడో అభియాన్ కార్యక్రమం కోసం కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమీక్ష సమావేశం



కోరుట్ల, జనవరి 10 (ప్రజా పాలన ప్రతినిధి ): కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ్ రావు సూచన మేరకు హాత్ సే హాత్ జోడో అభియాన్ కార్యక్రమం నిర్వహణ కోసం కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం మంగళ వారం రోజున నిర్వహించారు. సమావేశంలో కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిరుమల గంగాధర్ మాట్లాడుతూ హాత్ సే హాత్ జోడో అభియాన్ కార్యక్రమంలో ప్రతి కాంగ్రెస్ పార్టీ నాయకులు మండల స్థాయి నుండి బూత్ లెవల్ వరకు ప్రతి కార్యకర్త కోరుట్లలోని వార్డ్ లోని ప్రతి గడప గడపకు వెళ్లి గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో వున్నప్పుడు చేసిన అభివృద్ధి పనుల గురించి అందరికి తెలిసే విధంగా కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. ముఖ్యంగా వృద్ధులకు పెన్షన్ల విషయంలో ఉన్న అపోహను పోగొట్టాలని ఏ పార్టీ గెలిసిన వారి పెన్షన్లు వస్తాయని తెలియజేయాలని అన్నారు. అదే విధంగా రైతు సమస్యలపై కాంగ్రెస్ పార్టీ చేసిన, చేస్తున్న విషయాలను గ్రామంలోని ప్రతి రైతుకు వివరించాలని ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వరంగల్ డిక్లరేషన్ అమలు చేస్తామని ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేస్తాం సవత్సరానికి ఆరు సిలిండర్లు ఉచితంగా ఇస్తాం అని చెప్పిన రాహుల్ గాంధీ గారి మాటలను ప్రతీ రైతుకు మహిళలకు వివరించాలని అన్నారు. దేశం కోసం,దేశ ప్రజల కోసం రాహుల్ గాంధీ చేస్తున్న జోడో యాత్రని యాత్ర లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ సకల జనుల కోసం పోరాటం చేస్తుందని వాటి గురించి గ్రామాల్లో ప్రతి ఇంటికి తెలియజేయాలని అన్నారు. అదే విధంగా ఇటు రాష్ట్రంలో అటు కేంద్రంలోని రెండు ప్రభుత్వాలు పేద,మధ్య తరగతి ప్రజల మీద అవలంబిస్తున్న తీరును ఎండగట్టాలని అన్నారు. పెరిగిన డీజిల్ ధరలు. గ్యాస్ ధరలు నిత్యా అవసర సరుకుల ధరలు వాటి గురించి అందరికి అవగాహన కల్పిచాలని అన్నారు. ఒక ఏడాది పాటు కాంగ్రెస్ పార్టీ మండల స్థాయి నాయకుడు నుండి ప్రతి కార్యకర్త పని చేస్తే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిరుమల గంగాధర్ అన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ పట్టణ అధ్యక్షులు శ్రీరాముల అమరేందర్,పట్టణ ప్రధాన కార్యదర్శి బన్న రాజేష్, కార్యదర్శి మ్యాకల నర్సయ్య, సహాయ కార్యదర్శులు ఎంబేరి సత్యనారాయణ, చిటి మేల్లి రంజిత్, గుప్త , యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు రిజ్వాన్, జాగిలం భాస్కర్ , యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మ్యాదరి లక్ష్మణ్,నజ్జు , ముజిబిత్ ,ఎం డి ఇర్షాద్ ,తోడేటి శ్రావణ్ కుమార్ , సోషల్ మీడియా కోఆర్డినేటర్ వాసం అజయ్ , రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## పి హెచ్ డి సబ్మిషన్ కు ఏడాది గడువు పొడిగించాలి: ప్రొఫెసర్ హరగోపాల్




హైదరాబాద్ (ప్రజాపాలన ప్రతినిధి ):వివిధ కారణాలతో పి హెచ్ డి సబ్మిషన్ కు దూరంగా ఉన్న విద్యార్థులకు మరో ఏడాది గడువు ఇవ్వాలని ప్రొఫెసర్లు హరగోపాల్, ముత్తయ్య లు కోరారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో ఓయు పీహెచ్ డీ ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో విద్యార్థులది న్యాయమైన డిమాండ్ అని అన్నారు. వీసీ ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం తో ఎంతోమంది పీహెచ్డీ విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో కి వెళ్ళిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఇలాంటి నిబంధన లేదని విద్యార్థులు వెసులుబాటును బట్టి పీహెచ్ డి సబ్మిషన్ చేసుకునే అవకాశం ఉందని అన్నారు. సుమారు 75% పూర్తి చేసుకున్న విద్యార్థులు వీసీ నిర్ణయం తో వారి భవిష్యత్తు అంధకారంలోకి నెట్టివేయబడుతుందని అన్నారు. కరోనాకాలంలో ఏడాది కాలం చదువులకు దూరమైన విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని నిబంధనలను ఉపసంహరించుకొని మరో ఏడాది అవకాశం కల్పించి వారి భవిష్యత్తుకు బాటలు వేయాలని ప్రొఫెసర్లు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం లో పి హెచ్ డి విద్యార్థులు కనకారెడ్డి, మల్లేష్ పాల్గొన్నారు.


ప్రజాపాలన

జాతీయ తెలుగు దినపత్రిక తెలుగురాష్ట్రాల్లో విస్తృత పర్చేందుకు మా బిజినెస్ అసోసియేట్స్‌ను మీకు పరిచయం చేస్తున్నాం. దిగువ ఇవ్వబడిన బిజినెస్ అసోసియేట్స్ 'ప్రజాపాలన' జాతీయ తెలుగు దినపత్రికలో వార్తా సంబంధ విషయాల్లో,ప్రకటనలు స్వీకరించేందుకు,ప్రజాపాలన దిన పత్రిక చందా విషయమై ఎప్పుడూ మీకు అందుబాటులో ఉంటారు.

బిజినెస్ అసోసియేట్స్-టెలిఫోన్ నెంబర్లు

| | | |
|---|---|---|
| నరోత్తమ్‌రెడ్డి | మేడిపల్లి | 9346970159 |
| వెంకటస్వామి | మంచిర్యాల | 9515048103 |
| ఎం. గైబులు | వికారాబాద్ | 9704570475 |
| టి.రాంబాబు | శేర్లింగంపల్లి | 6301925113 |
| సత్య కిషోర్ | అమీర్‌పేట | 6309723472 |
| బోడ మనోహర్ నంద | కరీంనగర్ | 9492927684 |
| రాజేందర్ ప్రసాద్ | ఖమ్మం | 7013953536 |
| పి.ఎన్.శ్రీనివాస్ | మధిర | 9030821362 |
| గంజిగుంట్ల వెంకన్న | పాలేరు | 9848895405 |
| పసుపులేటి ఈశ్వర్‌తేజ | మధిర రూరల్ | 6305269141 |
| ఆర్.శ్రీనివాస్ | ఎర్రుపాలెం మండలం | 8501020885 |
| బుక్య.శ్రీను | బోనకల్ | 8688810293 |
| సి.మల్లేష్ | ఇబ్రహీపట్నం | 9618028334 |
| దుంపాల రాజేష్ | మేడ్చల్ | 9000178307 |
| వై.నర్సింహులు | తాండూరు | 7207677049 |
| టి.సురేష్ చారీ | ఆసిఫాబాద్ | 9000983108 |
| డి.భాస్కర్ | బెల్లంపల్లి | 9440018863 |
| ఐ.నర్సింహయ్య | జన్నారం రూరల్ | 9493314399 |
| గొట్టె సురేందర్ | మంచిర్యాల టౌన్ | 9248528680 |
| గొడ్లబాబూరావు | తల్లాడ | 9848236015 |
| ఎల్.వెంకట్ | మందమర్రి | 8106891666 |
| మహమ్మద్ హఫీజుద్దీన్ | కేతనపల్లి | 9701844456 |
| సాయిబాబు | భద్రాద్రి కొత్తగూడెం | 9603149645 |
| ఎన్.బండయ్య | చేవెళ్ల | 9959032940 |
| నరేందర్ | చేవెళ్ల | 9490148304 |
| ఎం.పరమేష్ | శంకరపల్లి | 7989723793 |
| ఊదిరి మహేష్ | చౌటుప్పల్ | 9550941419 |
| జి.అర్జున్ | శంకరపట్నం | 7386777544 |
| ఎం.యాదయ్య | చేవేళ్ల నియోజకవర్గం | 8328236516 |
| ఎం.మురళీ | షాబాద్ | 9989770468 |

# బాలికలను చదివిస్తే అదే గొప్ప ఆస్తి

## 2.5 కోట్ల నిధులతో నిర్మాణం

## మట్టిలో మాణిక్యాలను వెలికి తీయడమే కేజీబీవీ లక్ష్యం

## విద్యార్థుల మేధోశక్తిని ప్రేరణ పొందేలా బోధించాలి

## చాంద్రాయన్ పల్లిలో కేజీబీవీ భవనం ప్రారంభించిన విద్యాశాఖ మంత్రి



వికారాబాద్ బ్యూరో 10 జనవరి ప్రజా పాలన : ప్రతి తల్లిదండ్రి ఆడపిల్లలను బాగా చదివిస్తే అదే వారికి తరగని ఆస్తిగా మారుతుందని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఆడపిల్లల చదువుకు సిఎం కేసీఆర్ ప్రత్యేక చొరవ చూపుతున్నారని కొనియాడారు. మంగళవారం మోమిన్ పేట మండల పరిధిలోని చాంద్రాయన్ పల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ పెద్దోళ్ళ అంజన్న అధ్యక్షతన మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దబ్బుని వెంకట్ ఆధ్వర్యంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం అదనపు గదులు ప్రయోగశాలను ప్రారంభించిన విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ జడ్పీ చైర్ పర్సన్ సునీతా మహేందర్ రెడ్డి చేవెళ్ల ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్ రెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ జిల్లా విద్యాధికారిణి రేణుకాదేవి మోమిన్ పెట్ మండల ఎంపీపీ దబ్బుని వసంత వెంకట్ హాజరయ్యారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని విద్యాశాఖ మంత్రి మాట్లాడుతూ 2.5 కోట్ల రూపాయలతో నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం అదనపు గదులు ప్రయోగశాలను ప్రారంభించామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో మట్టిలో మాణిక్యాలు ఉంటారని సాన బెడితే అణిముత్యాలు బయటికి వస్తాయని అన్నారు. నాడు అమ్మాయిలను చదివించటం కష్టంగా ఉండేదని గత జ్ఞాపకాలను గుర్తు చేశారు. నేడు విశ్వవిద్యాలయాలు అమ్మాయిలతో నిండి కుండలా మారాయన్నారు. ఓయూలో 70 శాతం, కాకతీయ యూనివర్సిటీలో 80 శాతం విద్యార్థినీలతో నిండిపోయాయని అన్నారు. పిల్లల ఆసక్తికి అనుగుణంగా చదివించాలని ఉపాధ్యాయులకు సూచించారు. వారికి ఆసక్తి గోలిపేలా ఉపాధ్యాయులు బోధన చేయాలని మంత్రి హితవు పలికారు. చదువును మించిన ఆస్తి ఏమి ఉండదని బాగా చదివితే భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవచ్చన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్ద ఎత్తున గురుకులాలు, కెజిబివి పాఠశాలలు నెలకొల్పి చాలా వరకు ఇంటర్ వరకు అప్ గ్రేడ్ చేసి నాణ్యమైన విద్య అందేలా కృషి చేస్తున్నారని వెల్లడించారు. పాఠశాలలో ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. కెజిబివి విద్యార్థులు చదువులో బాగా రాణిస్తున్నారని ప్రశంసించారు. ప్రైవేటు పాఠశాలలో క్వాలిఫికేషన్ టీచర్లు ఉంటారో లేదా తెలియదు కానీ ప్రభుత్వ పాఠశాలలో మాత్రం క్వాలిఫికేషన్ టీచర్లతో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని వివరించారు. వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ మాట్లాడుతూ కేజీబీవీ విద్యాలయాల్లో ప్రాథమిక విద్యతో పాటు ఇంటర్ విద్యను కూడా అందిస్తున్నామని స్పష్టం చేశారు. పేద మధ్యతరగతి ఆడపిల్లల చదువుకు సీఎం కేసీఆర్ అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని వివరించారు. ఆడపిల్లల చదివితే మీ భవిష్య జీవితానికి బంగారు బాట వేసుకోవచ్చని ఆకాంక్షించారు. చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి మాట్లాడుతూ కేజీబీవీలో మౌలిక వసతులతో పాటు నాణ్యమైన విద్య లభిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. నూటికి 95 శాతంతో మంచి విద్య అందడంతో పాటు మంచి ఫలితాలు కూడా వస్తుండడం విశేషమని కొనియాడారు. జడ్పి చైర్ పర్సన్ సునీతా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ బాలికల విద్యకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం కేసీఆర్ సంకల్పం అని అన్నారు. వికారాబాద్ అభివృద్ధిలో వెనుకబడిన విద్యారంగంలో మాత్రం ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా రాణిస్తున్నవని స్పష్టం చేశారు. చదువుతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కెజిబివిలో చదువుతో పాటు నాణ్యమైన ఆహారం లభిస్తుందా అని ప్రశ్నించారు. విద్యార్థిని లక్ష్మి మాట్లాడుతూ పదవ తరగతి లోపు విద్యార్థులకు ఏమైన అనుమానాలు ఉంటే ఇంటర్ విద్యార్థులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం ఎల్ఆర్ఎస్ పథకం ద్వారా కట్టుకున్న ఇండ్ల లబ్ధిదారులకు సర్టిఫికెట్ లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి చీమల్ దరి గ్రామ సర్పంచ్ నాసన్ పల్లి నరసింహారెడ్డి ప్రజా ప్రతినిధులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సిఐటియు 17వ అఖిలభారత మహాసభల జయప్రదానికై జండా ఆవిష్కరణ



ఇబ్రహీంపట్నం జనవరి తేదీ 10 ప్రజాపాలన ప్రతినిధి: సిఐటియు అఖిలభారత 17వ మహాసభలు బెంగుళూర్ లో జనవరి 18 నుండి 22వరకు జరగనున్న నేపథ్యంలో మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ సీఐటీయూ అఖిల భారత కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా రాగన్నగూడలోని సిఐటియు తుర్కయంజాల్ మున్సిపల్ కార్యాలయం వద్ద జిల్లా ఉపాధ్యక్షులు డి కిషన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీనియర్ నాయకులు కాడిగళ్ల భాస్కర్ జెండావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలపై రాజీ లేకుండా పోరాడుతున్న సిఐటియు అఖిల భారత 17 మహాసభలు బెంగళూరు లో ఈనెల 18 నుండి 22 వరకు జరగనున్నాయని ఈ మహాసభలను విజయవంతం చేయడం కోసం కార్మిక వర్గాన్ని సంసిద్ధులను చేయడం కోసమే జండా ఆవిష్కరణలు చేస్తున్నామని అన్నారు కేంద్ర ప్రభుత్వం కార్మికులతో శ్రమ దోపిడీ చేయించుకుంటూ దేశ సంపదను కార్పొరేట్, పెట్టుబడుదారులకు అప్పనంగా కట్టబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు, ఒకవైపున రైతు వ్యతిరేక చట్టాలను, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ప్రజలపై భారాలు మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో బెంగళూరులో జరగనున్న సిఐటియు అఖిలభారత మహాసభలు అత్యంత ప్రాధాన్యతతో కూడుకున్నవని అన్నారు భవిష్యత్తులో నరేంద్ర మోడీ విధానాలపై పోరాడేందుకు మహాసభల్లో అనేక అంశాలను చర్చిస్తామని తద్వారా పోరాటాలకు కార్మిక వర్గాన్ని సిద్ధం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు డి జగదీష్ సిఐటియు నాయకులు గుర్రం జంగయ్య, ఎన్. యాదయ్య, బిక్షపతి మురళి మేతరి నవీన్ కుమార్ మంకాల రవి వెంకటయ్య మున్సిపల్ కార్మికులు జంగమ్మ అందాలు యాదమ్మ నర్సమ్మ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు,

## విద్యార్థులకు షూస్ పంపిణీ చేసిన సర్పంచ్ చేయడం జరిగింది



ఇబ్రహీంపట్నం జనవరి తేదీ 10 ప్రజాపాలన ప్రతినిధి :మంగళవారం రోజున మన ప్రాథమికోన్నత పాఠశాలలో సర్పంచ్ బూడిద రామ్ రెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు సూస్ పంపిణీ చేయడం జరిగింది ఈ యొక్క షూస్ దాత బూడిద రామ్ రెడ్డి సర్పంచ్ మాట్లాడుతూ ఈ రకంగా విద్యార్థులకు షూస్ పంపిణీ చేసిన లావణ్య రామ్ రెడ్డి దంపతులను అభినందించి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బూడిద నర్సింహారెడ్డి పాఠశాల చైర్మన్ బత్తుల వెంకటేష్, వార్డ్ సభ్యులు పద్మమ్మ, మారమని శ్రీనివాస్, కో ఆప్షన్స్ సభ్యులు మడుపు గోపాల్,, ప్రధానోపాధ్యాయులు నారాయణరెడ్డి, రంగారెడ్డి, రోజా, శ్యామల జ్యోతి, సువర్ణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు,

## సబ్సిడీ బియ్యం కొనసాగించాలి

### తాసిల్దార్ కు వినతి పత్రం అందజేసిన సిపిఎం



జన్నారం, జనవరి 10, ప్రజాపాలన: బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం సబ్సిడీ బియ్యం రద్దు చేయడం నిలిపివేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి కనికారపు అశోక్ అన్నారు. మంగళవారం సిపిఎం రాష్ట్ర వ్యాప్తి నిరసనలో భాగంగా స్థానిక తాసిల్దార్ ఇట్యాల కిషన్ కు పలు డిమాండ్ లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో సబ్సిడీ బియ్యాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడం అంటే నిరుపేదలు జీవించే హక్కును హరించడమేనని అన్నారు.సబ్సిడీ బియ్యం రద్దు చేయడం వలన రేషన్ కార్డు ఆధారంగా బతుకుతున్న కోట్లాదిమంది నిరుపేదల కుటుంబాలను ఆత్మహత్యల చేసుకొనే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రేషన్ షాపుల ఆధారంగా ఉపాధి పొందుతున్న అనేకమంది డీలర్లు ఉపాధి కోల్పోయి రోడ్డున పడుతారని పేర్కొన్నారు. దేశంలో ఆహార సంక్షోభం నెలకొనే ప్రమాదం ఉందని అన్నారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం దేశంలో సబ్సిడీ బియ్యాన్ని రద్దు చేసే కార్యక్రమాన్ని విరమించుకోవాలని తెలిపారు., కేరళ వామపక్ష ప్రభుత్వం మాదిరిగా 14 రకాల నిత్యావసర సరుకులను తెలంగాణ ప్రభుత్వం అందించడానికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారినుంచి దరఖాస్తు స్వీకరించి వాళ్లందరికీ కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పాత రేషన్ కార్డులలో పేర్లు మార్పులు చేర్పులు చేసుకునే అవకాశం మీ సేవలో నిరంతరం కొనసాగించాలని, ఎప్పుడైనా రేషన్ కార్డు కోసం ప్రజలు దరఖాస్తు పెట్టుకునే అవకాశం కల్పించాలని కోరారు. . ఈ కార్యక్రమంలో కూకటి కారి బుచ్చన్న, గాడ్ల రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

## కంటి వెలుగును విజయవంతం చేయాలి




మేడిపల్లి, జనవరి10 (ప్రజాపాలన ప్రతినిధి):తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈనెల 18న నిర్వహించనున్న రెండో దశ కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసినటువంటి కంటి వెలుగు సమావేశనికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రివర్యులు చామకూర మల్లారెడ్డి, ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, జడ్పీ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి,జిల్లా కలెక్టర్ హరీష్,అడిషనల్ కలెక్టర్ అభిషేక్ అగస్త్య, జాయింట్ కలెక్టర్ ఏనుగు నర్సింహ రెడ్డి, డిస్టిక్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ పుట్ల శ్రీనివాస్, గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి పద్మజారాణి, పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్ రెడ్డి,బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి, హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి, ఎమ్మెల్యే మాట్లాడుతూ రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని జిల్లా అధికారులంతా సమన్వయంతో విజయవంతం చేయాలని, ఈ నెల18 నుంచి క్యాంపులు నిర్వహించే చోట అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. కంటి వెలుగు నిర్వహించే వివరాలను ముందుగానే ఆయా ప్రాంతాల ప్రజలకు తెలిసేలా ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్వోలు ఆనంద్, నారాయణరావు, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ రఘునాథాస్వామి, డాక్టర్ సరస్వతి జిల్లా మాస్ మీడియా అధికారి వేణుగోపాల్ రెడ్డి, మంజుల, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు మరియు వివిధ కార్పొరేషన్ల కార్పొరేటర్లు,కౌన్సిలర్లు,మేడ్చల్ మల్కాజ్ గిరి వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు , సిబ్బంది వివిధ డిపార్ట్మెంట్ల అధికారులు మరియు మీడియా మిత్రులు , బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు జనంపల్లి వెంకటేశ్వర్ రెడ్డి, గడ్డం రవికుమార్, రవీందర్ రెడ్డి,పాల్గొన్నారు.

## నూతన ఆలయ కమిటీ ప్రమాణ స్వీకరోత్సవం

### ముఖ్యఅతిథిగా జడ్పీ చైర్మన్ లింగాల కమల్రాజు హాజరు



బోనకల్, జనవరి 9 ప్రజా పాలన ప్రతినిధి: మండల పరిధిలోని గార్లపాడు గ్రామం నందు శ్రీ వేణుగోపాల స్వామి, ఆంజనేయస్వామి ఆలయం నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం నేడు అనగా 10.01.2023 బుధవారం సాయంత్రం ఐదు గంటలకు కలదు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా పరిషత్ చైర్మన్, మధిర నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీ లింగాల కమల్ రాజు విచ్చేయుచున్నారు. కావున మండలంలోని బిఆర్ఎస్ పార్టీ మండల కమిటీ సభ్యులు, అనుబంధ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, బీ ఆర్ఎస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుచున్నాము.


## ప్రజాపాలన దినపత్రిక క్యాలెండర్ ను ఆవిష్కరించిన మేయర్ జక్క వెంకట్ రెడ్డి




మేడిపల్లి, జనవరి 10 (ప్రజాపాలన ప్రతినిధి) :ప్రజాపాలన తెలుగు జాతీయ దినపత్రిక క్యాలెండర్ ను పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ జక్క వెంకట్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ ప్రజల మనస్సును చురగొన్న ప్రజాపాలన దినపత్రిక దిన, దినాభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు. జర్నలిస్టులు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించడం కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు రాందాస్ గౌడ్, పీర్జాదిగూడ కార్పొరేషన్ బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు నిర్మల,బీఆర్ఎస్ నాయకులు మనోరంజన్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి (ప్రభు) తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బీఆర్ఎస్ నాయకులు

### బొమ్మక్ బాలయ్య జన్మదిన వేడుకలు



మేడిపల్లి, జనవరి 10 (ప్రజాపాలన ప్రతినిధి) :బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బొమ్మక్ బాలయ్య జన్మదిన వేడుకలను బొమ్మక్ బాలయ్య ఫంక్షనాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ జన్మదిన వేడుకల్లో మేయర్ సామల బుచ్చిరెడ్డి, కార్పొరేటర్లు కొత్త చందర్ గౌడ్, దొంతరబోయిన మహేశ్వరి కృపసాగర్ ముదిరాజ్ మరియు కో అప్షన్ సభ్యులు రంగా బ్రమ్మన్న గౌడ్ పాల్గొని బొమ్మక్ బాలయ్యను శాలువాతో సత్కరించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మున్సిపల్ సిబ్బందికి దుస్తులు పంపిణీ చేశారు. తదుపరి సంక్రాతి సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీలలో గెలిచినా వారికి బహుమతి ప్రధానం చేశారు.

## రంగారెడ్డి జిల్లా కార్యదర్శి సమక్షంలో బూత్ కమిటీ ఏర్పాటు



ఇబ్రహీంపట్నం జనవరి తేదీ 10 ప్రజాపాలన ప్రతినిధి :టిపిసిసి ఉపాధ్యక్షులు, ఇబ్రహీంపట్నం ముద్దుబిడ్డ మల్ రెడ్డి రంగారెడ్డి మంచాల మండలం లోని అన్ని గ్రామాలలో నూతన బూత్ కమిటీలను వేయాలని సూచించారు.అందులో భాగంగా ఈ రోజు చిత్తపూర్, తిప్పాయిగూడ గ్రామాలలో సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేసి నూతన గ్రామ కమిటీలను, బూత్ కమిటీలను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రాంరెడ్డి రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మునికుంట్ల సంతోష్ కుమార్ గౌడ్, ఎంపీటీసీ పోరం అధ్యక్షులు ఎడమ నరేందర్ రెడ్డి, ప్రేమకర్ రెడ్డి, రాజు, సురేష్, సత్తయ్య, జగయ్య జయ నందం, జైపాల్ రెడ్డి, బూత్ కమిటీ సభ్యులు, చిత్తాపురం గ్రామ అధ్యక్షులు జలముని పాండు, తిప్పాయిగూడ గ్రామ అధ్యక్షుడు కొమరయ్య, ఎన్నుకోవడం జరిగింది,

## ప్రత్యేక పూజలు నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కోడూరి రమేష్



ఇబ్రహీంపట్నం జనవరి తేదీ 10 ప్రజాపాలన ప్రతినిధి: ఇబ్రహీంపట్నం మండలం పెద్దతుండ్ల ( తులేకలన్ ) గ్రామంలో మంగళవారం రోజున మదర్ సావుల దర్గా ఊర్స్ ఉత్సవాలలో భాగంగా కోడూరు రమేష్ మాట్లాడుతూ రాబోయే అసెంబ్లీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యేగా మల్ రెడ్డి రంగారెడ్డి భారీ మెజార్టీతో గెలవాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన ఇబ్రహీంపట్నం మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోడూరు రమేష్ మరియు కాంగ్రెస్ నాయకులు పంబలి ప్రభు, కోడూరు జంగయ్య, తదితరులు పాల్గొన్నారు,




# ట్రోలర్స్ కి కిరణ్ అబ్బవరం స్మార్ట్ రిప్లై!



కిరణ్ అబ్బవరం.. 2019లో రవికిరణ్ కోల రూపొందించిన రొమాంటిక్ డ్రామా 'రాజా వారు రాణీగారు' మూవీతో హీరోగా ఎంట్రీ ఇచ్చాడు. ఈ మూవీ ఫరవాలేదనిపించింది. ఆ తరువాత శ్రీధర్ గాదె డైరెక్షన్ లో చేసిన 'ఎస్.ఆర్. కల్యాణ మండపం' కిరణ్ అబ్బవరంకు మంచి గుర్తింపుని తెచ్చిపెట్టింది. ఇందులో కిరణ్ అబ్బవరం హీరోగా నటించడమే కాకుండా స్టోరీ స్క్రీన్ ప్లేని అందించి మంచి విజయాన్ని సొంతం చేసుకున్నాడు. ఈ మూవీకి చేతన్ భరద్వాజ్ అందించిన ఆడియో యూట్యూబ్ లో వైరల్ గా మారి ట్రెండ్ అయింది. అయితే ఈ మూవీ తరువాత కిరణ్ అబ్బవరం నటించి మూడు సినిమాలు బ్యాక్ టు బ్యాక్ ఫ్లాప్ అయి షాకిచ్చాయి. బాలాజీ సయ్యపు రెడ్డితో చేసిన 'సెబాస్టియన్ పీసీ 524' గోపీనథ్ రెడ్డితో చేసిన 'సమ్మతమే' ..'ఎస్.ఆర్. కల్యాణ మండపం' వంటి హిట్ ని అందించిన శ్రీధర్ గాదెతో చేసిన 'నేను మీకు బాగా కావాలసిన వాడిని' మూవీ కూడా కిరణ్ అబ్బవరంకు చేదు అనుభవాన్ని చవిచూపించింది. దీంతో మళ్లీ హిట్టు కోసం కిరణ్ అబ్బవరం ఆశగా ఎదురు చూస్తున్నాడు. అతని ఆశలన్నీ ప్రస్తుతం గీతా ఆర్ట్స్ 2 బ్యానర్ పై బన్నీ వాసు నిర్మిస్తున్న 'వినరోభాగ్యము విష్ణుకథ'పైనే వున్నాయి. వరుస ఫ్లాపుల్లో వున్నా కిరణ్ అబ్బవరం డైరీ మాత్రం ఖాళీగా మాత్రం లేదు. 'వినరోభాగ్యము విష్ణుకథ'తో పాటు కిరణ్ అబ్బవరం మరో రెండు సినిమాల్లో నటిస్తున్నాడు. అందులో ఒకటి 'మీటర్'. ఈ మూవీని క్లాప్ ఎంటర్ టైన్ మెంట్ తో కలిసి మైత్రీ మూవీ మేకర్స్ వారు నిర్మిస్తున్నారు. ఇక మరో మూవీ 'రూల్స్ రంజన్'. ఏ.ఎం. రత్నం సమర్పణలో ఈ మూవీ రూపొందుతోంది. ఈ మూడు సినిమాలు బ్యాక్ టు బ్యాక్ రిలీజ్ కు రెడీ అవుతున్నాయి. మంగళవారం రిలీజ్ చేసిన 'వినరో భాగ్యము విష్ణుకథ' టీజర్ సినిమాపై అంచనాల్ని పెంచేసింది. హీరోగా రైటర్గా స్క్రీన్ ప్లే రైటర్ గా తన టాలెంట్ ని చూపిస్తున్న కిరణ్ అబ్బవరంపై నెట్టింట ఓ నెటిజన్ చేసిన ట్వీట్ ప్రస్తుతం నెట్టింట వైరల్ గా మారింది. దీనిపై కిరణ్ అబ్బవరం చాలా స్మార్ట్ గా స్పందించి ట్రోలర్స్ కి స్ట్రాంగ్ రిప్లై ఇవ్వడం ఆసక్తికరంగా మారింది. ఇటీవల ఓ నెటిజన్ 'వాల్తేరు వీరయ్య' ఈవెంట్ లో చిరు రవితేజ స్టేజ్ పై మాట్లాడు తున్న ఓ వీడియోని సోషల్ మీడియా లో పోస్ట్ చేశాడు. చిరంజీవి రవితేజ తామిద్దరమే ఇండస్ట్రీలో ఎలాంటి గ్యాప్ లేకుండా సినిమాలు చేస్తున్నా మని చెప్పిన విషయం తెలిసిందే. ఇదే వీడియోకు చిరు కు కిరణ్ తల ని రవితేజకు ఆది సాయి కుమార్ తలని అంటించి మీమ్ చేయడంతో కిరణ్ అబ్బవరం హర్ట్ అయ్యాడు. అలా చేసిన నెటిజన్ కు వెంటనే తనదైన స్టైల్లో స్ట్రాంగ్ రిప్లై ఇచ్చాడు. 'బ్రదర్ నా 3 ఏళ్ల కెరీర్ లో 5 సినిమాలు మాత్రమే చేశాను. నాకు తెలియకుండా విడుదలైన ఇతర సినిమాలు మీకు తెలిస్తే దయచేసి నాకు తెలియజేయండి' అంటూ రిప్లై ఇచ్చాడు. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్ గా మారింది.

## పవన్ 'కోహినూర్' దొంగ.. వీరమల్లు సీన్స్ అదుర్స్..!



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ క్రిష్ కాంబోలో భారీ అంచనాలతో తెరకెక్కుతున్న సినిమా హరి హర వీరమల్లు. ఈ సినిమాను ఏ.ఎం.రత్నం నిర్మిస్తున్నారు. సినిమాలో పవన్ కళ్యాణ్ ఒక బందిపోటు దొంగ గా కనిపిస్తారని టాక్. ఇక ఈ సినిమా కథ 17వ శతాబ్దం ఔరంగజేబు సామ్రాజ్యం నాటి నేపథ్యంతో వస్తుంది. సినిమాలో పవన్ ఇదివరకు ఎప్పుడూ చూడని విధంగా లుక్స్ యాక్షన్ తో కనిపిస్తారని తెలుస్తుంది. ఇక సినిమాలో పవన్ దొంగ గా కోహినూర్ వజ్రాన్ని దొంగిలిస్తారట. ఔరంగజేబు సామ్రాజ్యంలో ఉన్న కోహినూర్ ను పథకం ప్రకారం వీరమల్లు తన సొంతం చేసుకుంటారట. ఈ సీన్స్ సినిమాలో చాలా స్పెషల్ గా సినిమాకు హైలెట్ గా ఉంటాయని తెలుస్తుంది. క్రిష్ ఈ సినిమాను చాలా ఫోకస్ తో తెరకెక్కిస్తున్నారు. పవన్ కెరీర్ లో డిఫరెంట్ మూవీగా హరి హర వీరమల్లు సినిమా వస్తుంది. సినిమా అంతా ప్రేక్షకులకు ఒక అద్భుతమైన అనుభూతి అందిస్తుందని అంటున్నారు. ప్రేక్షకులకు కావాల్సిన వినోదం తో పాటుగా 17వ శతాబ్దం నాటి కథను కూడా క్రిష్ ఈ సినిమాతో చెప్పబోతున్నారు. సినిమాలో హీరోయిన్స్ గా నిధి అగర్వాల్ జాక్వెలిన్ నటిస్తున్నారు. బాలీవుడ్ హీరోయిన్ నోరా ఫతేహి కూడా ఈ సినిమాలో స్పెషల్ రోల్ లో నటిస్తుందని తెలుస్తుంది. పవన్ ఈ సినిమా మీద పూర్తి నమ్మకంతో ఉన్నాడని తెలుస్తుంది. నిర్మాత ఏ.ఎం రత్నం కూడా సినిమాను ఎక్కడ కాంప్రమైజ్ కాకుండా ఖర్చు పెడుతున్నారు. పవన్ హరి హర వీరమల్లు సినిమా పాన్ ఇండియా మూవీగా వస్తుంది. సినిమా తప్పకుండా ప్రేక్షకుల అంచనాలకు తగినట్టుగానే ఉంటుందని చెప్పొచ్చు. సినిమాలో ఔరంగజేబు పాత్రలో బాలీవుడ్ స్టార్ బాబీ డియోల్ నటిస్తున్నారు.

## అయ్యో రష్మిక ఎంత పని జరిగింది..!




సౌత్ సినిమాలు తీసే టైం లోనే ఆమెని నేషనల్ క్రష్ అన్నారు. ఇక బాలీవుడ్ ఛాన్స్ లు అందుకుంటున్న టైం లో ఆమె పేరు మారుమ్రోగింది. తీరా అక్కడ సినిమాలు చేస్తున్న టైం లో మాత్రం ఆమెకు బ్యాడ్ టైం స్టార్ట్ అయ్యింది. ఇంతకీ ఎవరా హీరోయిన్ అంటే నేషనల్ క్రష్ అనగానే అందరికి అర్థమయ్యే ఉంటుంది ఆ అమ్మడు ఎవరో కాదు రష్మిక మందన్న. అమ్మడు చేస్తున్న సినిమాలు ఆడియన్స్ ను సూపర్ గా ఎంటర్టైన్ చేస్తున్నాయి. తెలుగు తమిళ సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్న రష్మికకు బాలీవుడ్ నుంచి అవకాశాలు మొదలయ్యాయి. ఎంత సౌత్ స్టార్డం తెచ్చుకున్నా బాలీవుడ్ అంటే కథానాయికలకు ఒక మోజు ఉంటుంది. ఈ క్రమంలో హిందీ సినిమా ఛాన్సులు రాగానే రష్మిక కూడా ఎగిరి గంతేసింది. మొదటి సినిమా అమితాబ్ తో చేసిన గుడ్ బై నిరాశపరచగా త్వరలో మిషన్ మజ్ను సినిమా కూడా ప్రేక్షకుల ముందుకు వస్తుంది. 1970 ఇండో పాక్ యుద్ధం నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కింది. సిద్ధార్థ్ మల్హోత్రా సరసన నటించిన రష్మిక ఈ సినిమాలో కూడా పాకిస్తాన్ అమ్మాయిగా నటించింది. సినిమాను థియేట్రికల్ రిలీజ్ చేస్తారని అనుకోగా డైరెక్ట్ ఓటీటీ కి రిలీజ్ లాక్ చేశారు. రష్మిక బాలీవుడ్ ఆశలపై ఈ రెండు సినిమాలు దాదాపు నీళ్లు చల్లేశాయని చెప్పొచ్చు. బాలీవుడ్ లో తన టాలెంట్ తో అదరగొట్టేద్దామని అనుకున్న రష్మికకు మొదటి రెండు సినిమాలే పెద్ద షాక్ ఇచ్చాయి. మరోపక్క తెలుగు తమిళ భాషల్లో కూడా పెద్దగా అవకాశాలు లేవు.

## నీకేమో అందం ఎక్కువ.. శ్రీదేవి వెంట పడుతున్న వాల్తేరు వీరయ్య




మెగాస్టార్ చిరంజీవి వాల్తేరు వీరయ్య సినిమా విడుదలకు మరో రెండు రోజుల సమయం మాత్రమే ఉంది. ఇప్పటి వరకు ఈ సినిమా నుండి నాలుగు పాటలు వచ్చాయి. నాలుగు పాటలు కూడా మెగా ఫ్యాన్స్ తో పాటు మాస్ ఆడియన్స్ ను ఆకట్టుకుంది. ప్రతి పాట కూడా మాస్ ఆడియన్స్ ను కూర్చో నివ్వకుండా చేస్తున్న విషయం తెల్సిందే. బాస్ పార్టీ... శ్రీదేవి ఐతే నేను చిరంజీవి పాట ఇలా ప్రతి పాట కూడా ఆహా అనిపించే విధంగా ఉంది. ఇప్పుడు ఈ సినిమా నుండి ఐదవ సాంగ్ నీకేమో అందం ఎక్కువ అంటూ రాబోతుంది. చిరంజీవి మరియు శృతి హాసన్ కాంబోలో ఈ పాట ఉంటుందని పోస్టర్ ను చూస్తే అర్థం అవుతుంది. శృతి హాసన్ ను టీజ్ చేస్తూ సాగే ఈ పాట కు దేవి శ్రీ ప్రసాద్ తనదైన మార్క్ సంగీతాన్ని ఇచ్చాడంటూ యూనిట్ సభ్యులు చెబుతున్నారు. ఈనెల 11వ తారీకున హైదరాబాద్ లోని మల్లారెడ్డి యూనివర్శిటీలో ఈ పాటను విడుదల చేయబోతున్నట్లుగా చిత్ర యూనిట్ సభ్యులు అధికారికంగా ప్రకటించారు. సినిమా ప్రమోషన్ కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే సినిమా ఎప్పుడెప్పుడు వస్తుందా అంటూ ఫ్యాన్స్ ఎదురు చూస్తున్నారు. ఈ పాట విడుదల తర్వాత సినిమాపై ఆసక్తి మరింతగా పెరిగే అవకాశం ఉంది. సంక్రాంతి కానుకగా జనవరి 13వ తారీకున విడుదల కాబోతున్న వాల్తేరు వీరయ్య సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకేలా ఉన్నాయి అంచనాలకు తగ్గట్లుగా మాస్ మసాలా ఎలిమెంట్స్ తో ఈ సినిమాను దర్శకుడు బాబీ తెరకెక్కించాడని ట్రైలర్ చూస్తూ ఉంటే అర్థం అవుతుంది. మైత్రి మూవీ మేకర్స్ వారు ఈ సినిమాకు కాస్త ఎక్కువగానే ఖర్చు చేసినట్లుగా సమాచారం అందుతోంది. ఇక సంక్రాంతికి మెగా ఫ్యాన్స్ కు పండుగ రెట్టింపు చేసే విధంగా సినిమా ఉంటుందని యూనిట్ సభ్యులు చాలా నమ్మకంగా చెబుతున్నారు. రవితేజ.. ప్రకాష్ రాజ్.. శృతి హాసన్.. కేథరిన్ తెర్సా తో పాటు ఇంకా ఎంతో మంది ప్రముఖ నటీ నటులు ఈ సినిమా లో కనిపించబోతున్నారు. ఒక విభిన్నమైన మాస్ మసాలా సినిమాగా ఈ సినిమా ఉండబోతుంది.

## రామ్ చరణ్ టీమ్ కు కూడా అవే ఎదురు చూపులు..!



ఆ మధ్య మహేష్ బాబు.. త్రివిక్రమ్ సినిమా షూటింగ్ కార్యక్రమాలు నిర్వహించేందుకు హీరోయిన్ పూజా హెగ్డే అందుబాటులో లేకపోవడంతో వాయిదా వేసినట్లుగా వార్తలు వచ్చాయి. కొన్ని రోజుల తర్వాత పూజా హెగ్డే అందుబాటులోకి వచ్చిన తర్వాత మహేష్ బాబు మరియు త్రివిక్రమ్ యొక్క సినిమా షూటింగ్ పునః ప్రారంభం అయిన విషయం తెల్సిందే. హీరోయిన్స్ రెండు మూడు సినిమాలు ఒకేసారి చేస్తూ ఉండటం వల్ల డేట్ల విషయంలో అప్పుడప్పుడు ఇలాంటి సమస్యలు వస్తూ ఉంటాయి. ఇప్పుడు రామ్ చరణ్.. శంకర్ కాంబో సినిమాకు కూడా హీరోయిన్ వల్ల సమస్య తప్పలేదు. ఇండస్ట్రీ వర్గాల ద్వారా అందుతున్న సమాచారం ప్రకారం రామ్ చరణ్.. శంకర్ సినిమా హీరోయిన్ కియారా అద్వానీ కారణంగా తాజా షెడ్యూల్ క్యాన్సిల్ అయ్యిందట. కియారా అద్వానీ గతంలో ఇచ్చిన డేట్స్ లో శంకర్ సన్నివేశాలు ముగించలేక పోయాడట. దాంతో ఇప్పుడు ఆమె కొత్తగా డేట్లు ఇచ్చేందుకు ఇబ్బందిగా ఉందట. ప్రస్తుతం హిందీలో ఆమె వరుసగా సినిమాలు చేస్తున్న కారణంగా రామ్ చరణ్ మరియు శంకర్ లు వెయిట్ చేయాల్సి వచ్చింది అంటూ మీడియా సర్కిల్స్ ద్వారా సమాచారం అందుతోంది. రామ్ చరణ్ మరియు శంకర్ కాంబోలో రూపొందుతున్న సినిమా యొక్క చిత్రీకరణ ఈ సమ్మర్ వరకు పూర్తి చేయాలని ప్లాన్ చేస్తున్నారు. దిల్ రాజు నిర్మిస్తున్న ఈ భారీ బడ్జెట్ సినిమాను ఇదే ఏడాది దసరా లేదా దీపావళి సందర్భంగా విడుదల చేసే విధంగా ప్లాన్ చేస్తున్నారట. కియారా అద్వానీ యొక్క డేట్లు ఈ నెల చివరి నుండి లేదా ఫిబ్రవరి నుండి అందుబాటులో ఉండే అవకాశం ఉంది. అప్పుడు షూటింగ్ షురూ అయ్యే అవకాశం ఉందని సమాచారం అందుతోంది.


### స్నేహ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటి లిమిటెడ్

PAY BACK TO SOCIETY · SNEHA CLUB · SNEHA MACS

గత 20 సం॥లు గా సమాజ మార్పుకోసం కంపెనీకి వచ్చే లాభాలను పేదప్రజల కనీస అవసరాల కోసం ఖర్చు చేస్తూ సోషల్ ఇంజనీరింగ్ చేస్తున్నాం.

SCHEDULE OF INTEREST RATES ON FIXED & R.D. ACCOUNTS

| Term | General | Senior Citizens |
|---|---|---|
| 180 Days - 1 Year | 7% | 7.5% |
| 1 Year - 2 Years | 8% | 8.5% |
| 2 Years - 3 Years | 9% | 9.5% |
| 3 Years - 5 Years | 10% | 10.5% |
| Above 5 Years | 11% | 11.5% |
| Savings Bank A/c | 5% | 5% |
| Recurring Deposit | 6% | 6.5% |


J.B. RAJU, IIS, vrs Ambassador
Dr. B.M. Vinod Kumar IFS Retd
Nerella Koteswara Rao DGM vrs BSNL
Dr. Guduri Seethamaha Lakshmi
M. Padma Sarma D.E. vrs BSNL
G. Kenny Bob
Dr. N. Venkateswarlu Principal Retd, Govt. Dental College
P.M. Raju. Chief Engineer, Retd
A. Punna Rao Chief Manager, Retd, Canara Bank
Arepally Rajendar DGM vrs, NTPC
S. Rama Krishna

Chairman : Dr. K. Siva Bhagya Rao, IRS vrs

CONTACT :
Hyderabad 76600 27682, 7842106355
Visakhapatnam 0891-2791205, 9246663046, 7660027696, 7660027664
Vijayawada 76600 27670, 900062111
Tirupathi 94400 77239
Bapatla 94403 20562
Ponnur 99089 91763
Cherukupalli 79958 56068
Karlapalem 76600 27676

H.No. 6-29/3/12, 3rd Floor, Daulat Plaza, Lakdikapul, Hyderabad - 500 004
E-mail : snehamacsltd@gmail.com


## మన జక్కన్న మరో అమెరికన్ ఘనత సాధించాడోచ్




టాలీవుడ్ జక్కన్న రాజమౌళి బాహుబలి సినిమాతో దేశ వ్యాప్తంగా పాపులారిటీని సొంతం చేసుకున్నాడు. ఇక ఆర్ఆర్ఆర్ సినిమాతో ఏకంగా ప్రపంచవ్యాప్తంగా వందకు పైగా దేశాల్లో జక్కన్న గురించి తెలిసింది. ఒక తెలుగు సినిమా దర్శకుడు ఈ స్థాయి ఘనత దక్కించుకోవడం బాలీవుడ్ దర్శక నిర్మాతలకు కూడా ఆశ్చర్యంగా ఉండి ఉంటుంది. ఆస్కార్ ముందు ఉన్న టాలీవుడ్ జక్కన్న పలు అరుదైన రికార్డులను.. గౌరవాన్ని సొంతం చేసుకుంటున్నారు. ఆస్కార్ అవార్డ్ వచ్చినా రాకున్నా... ఆస్కార్ నామినేషన్స్ ను దక్కించుకోకున్నా కూడా జక్కన్నకు మరియు ఇతర ఆర్ఆర్ఆర్ సినిమా యూనిట్ సభ్యులకు దక్కుతున్న గౌరవం ఏ ఇండియన్ సినిమాలకు మరియు ఫిల్మ్ మేకర్స్ కు దక్కలేదు. తాజాగా రాజమౌళి అమెరికన్ అత్యంత ప్రతిష్టాత్మక ప్రముఖ టాక్ షో లో పాల్గొనబోతున్నాడు. లేట్ నైట్ విత్ సేత్ మేయర్స్ లో రాజమౌళి ఆర్ఆర్ఆర్ సినిమా గురించి మాట్లాడబోతున్నాడు. అమెరికాతో పాటు ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో ఈ టాక్ షో కు మంచి ఆదరణ ఉంటుంది. హాలీవుడ్ ఫిల్మ్ మేకర్స్ మరియు అంతర్జాతీయ స్థాయి సెలబ్రేటీలను మాత్రమే ఈ టాక్ షో లో ఇప్పటి వరకు ప్రేక్షకులు చూశారు. మొదటి సారి ఒక ఇండియన్ స్టార్ డైరెక్టర్ ను ఆ షో లో ప్రేక్షకులు చూడబోతున్నారు. దీన్ని బట్టి రాజమౌళి అంతర్జాతీయ స్థాయి స్టార్ సెలబ్రెటీ హోదాను దక్కించుకున్నాడు అని చెప్పుకోవచ్చు. రాజమౌళి మరియు ఆర్ఆర్ఆర్ యూనిట్ సభ్యులు ప్రస్తుతం యూఎస్ఏ లో ఉన్న విషయం తెల్సిందే. జనవరి 11న జరిగే గోల్డెన్ గ్లోబ్ వేడుకకు హాజరు అవ్వబోతున్నారు. ఈ సినిమా మరియు ఉత్తమ ఒరిజినల్ సాంగ్ అవార్డులకు నామినేషన్స్ ను రాజమౌళి టీమ్ దక్కించుకున్న విషయం తెల్సిందే. అందే జక్కన్న ఆ అవార్డుల వేడుకలో పాల్గొనబోతున్నారు. ఆ సందర్భంగానే లేట్ నైట్ విత్ సేత్ మేయర్ టాక్ షో లో జక్కన్న సందడి చేయబోతున్నాడు.

Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2-29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989